ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

సోమవారం 15 జూలై 2024 | 5






## గోష్పాదేశ్వరుడికి అలంకరణ

కొవ్వూరు, జూలై 14 : ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని కొవ్వూరు గోష్పాదేశ్వర స్వామి ఆలయంలో లలితాదేవిని కూరగాయలతో శాకాంబరి మాతగా అలంకరించి విశేషపూజలు చేశారు. కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి గోష్పాదేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. లలితాదేవిని కూరగాయలతో అలంకరించి మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆ కూరగాయలతో చేసిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం రూరల్, జూలై14: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) పోర్టల్ ద్వారా తమ సమస్యను నేరుగా సీఎం కార్యాలయానికి తెలియజేయడానికి అనుమతిస్తుందన్నారు. ప్రజలు నేరుగా 1902 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్ ,మండల స్థాయిలో ఆయా ప్రధాన కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకి అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

## కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, జూలై 14 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా,లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులతో ఆలయం కళకళలా డింది.మొత్తం రూ.1,56,217లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

## గుండెపోటుతో యువకుడు మృతి



తాళ్ళపూడి, జూలై 14 : గుండెపోటుతో యువకుడు మృతిచెందాడు.తాళ్ళపూడి మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పలసపూడి ఆశీర్వాదం కుమారుడు సంజీవ్‌కుమార్ (29)కి నాలుగు రోజుల కిందట బిడ్డ పుట్టాడు.ఈ మేరకు ఆదివారం మొక్కుతీర్చుకునేందుకు కుటుంబీకులతో గౌరీపట్నం మేరీమాత ఆలయానికి వెళ్లాడు. ఆలయం వద్ద గుండెల్లో తేడాగా ఉందని చెప్పాడు. గ్యాస్ ట్రబుల్ అయి ఉంటుం దని పట్టించుకోలేదు. మొక్కు తీర్చుకుని ఆసుపత్రికి వెళదామని అనుకున్నారు. అంత కంతకూ గుండె వద్ద నొప్పి పెరుగుతూనే ఉంది. కాసేపటికి తట్టుకోలేకపో వడంతో ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. తల్లి దండ్రులు కుమారుడి మృతదేహాన్ని పట్టుకుని లేరా నాన్నా అంటూ బోరున కన్నీటి పర్యంతమవడం చూపరులను కలచివేసింది.

## వెంటాడిన మృత్యువు

### ఒక లారీ ఢీకొంటే.. మరో లారీ కింద పడి మృతి

గోపాలపురం, జూలై 14 : మృత్యువు వేటాడి వెంటాడింది. ఒక వృద్ధుడు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఎగిరిపడి ఎదురుగా వస్తున్న లారీ కిందపడి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.గోపాలపురం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన సాపర్ల హరిచంద్రప్రసాద్ (60) ఆదివారం సాయంత్రం గోపాలపురం వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. గోపాలపురం శివార్లలో ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో హరిచంద్రప్రసాద్ వాహనంతో పాటు ఎగిరి కుడివైపునకు పడడంతో కొయ్యలగూడెం నుంచి రాజమహేంద్రవరం వస్తున్న లారీ అతని పైనుంచి వెళ్లింది.దీంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడన్నారు.కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## జీపీఎస్ గెజిట్ రద్దు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 14 : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జయకర్, ఏ.షరీఫ్ అన్నారు. రాజమహేంద్రవరం యూటీఎఫ్ హోంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయగలిగిన ప్రభుత్వం జీపీఎస్ గెజిట్‌ను ఎందుకు రద్దు చేయడంలేదన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉనికిని దెబ్బతీస్తున్న జీవో నెం.117ను రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. పాఠశాల విద్యా కేలండర్ ప్రకటించాలని, పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.సమావేశంలో నాయకులు విజయగౌరీ, ఈవీవీఎస్ఆర్ ప్రసాద్, శ్రీమణి, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

---

పనులు - 3303 | నిధులు - 764.14 కోట్లు | చేసినవి -104.63 కోట్లు

# పనులన్నీ.. పెండింగే!



వెలుగుబందలో నిలిచిన వాటర్ ట్యాంక్ నిర్మాణం

## వైసీపీ ప్రగల్భాలు.. పనులకు ఆటంకాలు

- జలజీవన్ మిషనూ ఆగిపోయే..
- పేదల కాలనీల పనులూ సాగలేదు
- గడపగడపకూ ...పెండింగే
- సీఎం డీఎఫ్ పనులూ అంతే
- అంచనాల్లో ఉపాధి పనులు
- రూ.27.51 కోట్లు పెండింగ్
- బిల్లులందక వైసీపీ నేతల గగ్గోలు
- 260 మంది లబోదిబో

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం పనులన్నీ ఒట్టి డొల్ల. అన్ని ప్రగల్భాలే. ఆరంభ శూరత్వం తప్ప.. అమలు శూన్యం. ఎక్కడి పనులు అక్కడే. రూ.కోట్లు నిధులు ఇస్తున్నట్టు చెప్పి..పనులు ఆరంభించి ఎవరికీ నిధులు ఇవ్వకుండా.. చేసిన పనులకు బిల్లులూ చెల్లించకుండా అందరినీ ముంచేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. కేవలం ఒక గ్రామీణ మంచి నీటి సరఫరా వ్యవస్థ (ఆర్‌డబ్ల్యూఎస్) ద్వారా జిల్లాలో అనేక పనులకు అంచనాలు వేయించి చివరకు తుస్ మనిపించారు..దీంతో వైసీపీ అధినేత జగన్‌ను నమ్ముకున్నవారే నట్టేట మునిగారు. జిల్లాలో మొత్తం వివిధ గ్రాంట్లు కింద 3303 పనులకు రూ.764.14 కోట్లతో అంచనా వేసి కేవలం రూ.104.63 కోట్లు విలువైన పనులు మాత్రమే చేయించారు. రూ. 27.51 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా 227 పనులు వివిధ దశల్లో ఆగిపోగా, నిధుల లేమితో 1412 పనులు అసలు ఆరంభించలేదు. ఇలా నాడు సీఎం జగన్ మాట తప్పాడు.. మడమ తిప్పాడు..

### వైసీపీ నాయకులు లబోదిబో..

జగన్ సీఎంగా ఉన్నప్పుడు సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట నిధులిస్తామని.. ప్రతి నియోజకవర్గంలోనూ పనులు చేయాలని చెప్పడంతో రూ.5లక్షల లోపు పనులు ఆరంభించారు. అయితే పనులు సాగుతున్నా డబ్బులు రాకపోవడంతో పలువురు వైసీపీ సర్పంచ్‌లు, పలువురు వైసీపీ చోటా నాయకులు ఇవాళ లబోదిబోమంటున్నారు. జగన్ మాటలు నమ్మి ఇరుక్కుపోయిన వైసీపీ చోటా లీడర్లు జిల్లాలో సుమారు 260 మంది వరకూ ఉన్నట్టు అంచనా. గడపగడపకూ వైసీపీ నేతలు ఇచ్చిన హామీలతో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇందులో ఉండడం గమనార్హం. అయితే ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ఓడిపోవడంతో ఆయా నాయకుల పరిస్థితి అయోమయంగా ఉంది. తమ బిల్లులు సెటిల్ చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఎలాగోలా తమను గట్టెక్కించాలని వేడుకుంటున్నారు. కానీ అధికారులు ఏమీ చేయలేక.. ఏదో సర్దిచెప్పి పంపించేస్తున్నారు.

### సీఎం నిధులకే దిక్కులేదు..

సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట జిల్లా లో 81 పనులకు రూ. 4.79 కోట్లతో అర్జంట్‌గా అంచనాలు వేయించారు. రూ.5లక్షలలోపు పనులన్నీ నామినేషన్ విధానం లో చేయిస్తామని అప్పటి ఎమ్మెల్యేలు చెప్పారు.వైసీపీ కార్యక ర్తలు కొందరు ముందుకు వచ్చి పనులు మొదలు పెట్టారు. 29 ఆరంభించి 28 పూర్తి చేశారు.రూ.71.94 లక్షలు బిల్లులివ్వలేదు.మిగతా 52 పనులు చేయలేదు. ప్రస్తు తం చేసిన పనులకు డబ్బులందక గిజగిజలాడిపోతున్నారు.

### గడపగడపకూ నిధులకు నీరసం..

వైసీపీ చివరి రెండేళ్లలో మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎంపీలందరినీ గడపగడపకూ మన ప్రభుత్వం పేరిట ప్రజల వద్దకు పంపింది. దీనిలో భాగంగా వైసీపీ జిల్లాలో 1263 పనులకు హామీ ఇచ్చింది.ఆయా పనులకు రూ.43.58 కోట్లు ఖ ర్చ వు తుందని అంచనా వేసింది. అయితే గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వైసీపీకి చెందిన చోటా నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు.వారితో చిన్న డ్రైన్లు పనులు 820 చేయించారు. 26 పనులు ఆరంభించారు. మరో 417 పనులు ఆరంభించలేదు. చేసిన పనులకు రూ. 18.29 కోట్లు ఖర్చయింది. అందులో ఇంకా రూ. 7.38 కోట్ల బిల్లులు చెల్లించలేదు.దీంతో సదరు వైసీపీ లీడర్లు లబోదిబోమంటున్నారు.

### డీఎంఎఫ్ పట్టించుకోలేదు..

జిల్లాలో ఇసుక, ఇతర గనుల నుంచి జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) ఉంటుంది. ఇసుక అమ్మకాలు, ఇతర మినరల్స్ అమ్మకాల్లో కొంత శాతం ఫండ్‌కు కేటాయించాలి. దీంతో గ్రామాల్లో డ్రైన్ల వంటివి నిర్మించాలి. వైసీపీ ఐదేళ్లలో డీఎంఎఫ్ గురించే పట్టించుకోలేదు. అప్పటికే ఉన్న సొమ్ముతో రూ. 8.15 కోట్లతో 151 పనులకు అంచనాలు వేశారు. 43 పనులు ప్రారంభించి కేవలం 35 పూర్తిచేశారు. వాటికే రూ.కోటి బకాయి ఉండడంతో మిగతా 103 పనులు అసలు మొదలు పెట్టలేదు. 13 పనులు ఆగిపోయాయి.

### ఉపాధి పనులు హుళక్కే.

ఎంజీఎన్ఆర్ ఈజీఎస్(ఉపాధిహామీ) పథకం కింద రూ. 19.29 కోట్లతో 243 పనులకు అంచనా వేశారు. వీటితో గ్రామాల్లో సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లు నిర్మించాలి. 71 పనులు ప్రారంభించగా 25 పూర్తి చేశారు. దానికి సంబంధించి రూ.64.36 లక్షల బిల్లులు ఇవ్వకపోవడంతో 46 పనుల మధ్యలో ఆగిపోయాయి. 172 పనులను అసలు ఆరంభించకుండానే వదిలేశారు. సచివాలయాల టాయిలెట్స్ నిర్మాణానికి రూ.11.76 కోట్ల తో 392 పనులు అంచనాలు వేసి 331 పూర్తి చేశారు.ఇంకా 49 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 12 పనులు మొదలు పెట్టలేదు.ఇందులో చేసిన పనులకు ఇంకా రూ.53.76 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

### జీవం పోయిన జలజీవన్..

జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా అనేక పనులు చేయాలని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఈ పథకం గతంలో టీడీపీ ప్రభుత్వం ఉండగా మంజూరైంది. అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ వాటర్ గ్రిడ్‌తో గోదావరి నీటిని ఇంటింటికీ సరఫరా చేయాలని ప్రయత్నించారు. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ డిజైన్లను, అంచనాలు అస్తవ్యస్తం చేసింది. చివరకు రూ. 489 కోట్ల అంచనాతో 670 పనులు చేయడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు.ప్రతి గ్రామంలోని మంచినీటి వ్యవస్థను మెరుగుపరచడం పనుల లక్ష్యం.. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం. పైపులైన్లు నిర్మించడం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడం వంటి పనులు ఇందులో ఉన్నాయి. కానీ చచ్చీచెడి రూ.355 పనులు చేశారు.మరో 84 ప్రారంభించారు. 231 పనుల ప్రారంభించలేదు. కానీ చేసిన వాటికి రూ.59.55 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉండగా కొంతమాత్రమే చెల్లించారు. ఇంకా రూ.11.56 కోట్లు బిల్లులు చెల్లించలేదు. దీంతో ప్రారంభించిన పనులతో పాటు మిగతా 231 పనులు ఆగిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు, బినామీలతో పనుల్లోకి దిగిన వైసీ పీ నేతలు గగ్గోలు పెడుతున్నారు. పేదలందరికీ ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జలజీవన్ మిషన్‌కు చెందిన రూ. 176.66 కోట్లతో 376 కాలనీల్లో 497 పనులకు అంచ నాలు వేశారు. కేవలం 72 పనులు ఆరంభించి 70 చేశారు. రూ.19.20 కోట్ల బిల్లులు ఇవ్వవలసి ఉండగా కొంత మాత్రమే ఇచ్చారు. ఇంకా రూ.5.69 కోట్లు పెండింగ్ ఉంది. మిగతా 425 పనులు ఆగిపోయాయి.చేసిన వాటికీ పూర్తిగా బిల్లులు చెల్లించలేదు. మిగతా కాలనీల్లో చేయవలసిన పనులూ చేయలేదు. వెలుగుబంద కాలనీలో ఓహెచ్‌ఆర్ నిర్మా ణం మధ్యలోనే ఆగిపోయింది.మంచినీటి సరఫరాకు చెం దిన సీపీ డబ్ల్యూఎస్ ఎస్‌కు సంబంధించి ఆపరేషన్ అండ్ మెయింట్ నెన్స్‌కు గత మూడేళ్లగా పైసా ఇవ్వలేదు. దీని ద్వారా లక్షల మందికి మంచినీటి సరఫరా జరుగుతోంది. పురుషోత్తపట్నం, కడియం,సీతానగరం, తాళ్లపూడి, రంగంపేట మండలాల్లో ఈ పథకాలు ఉన్నాయి.కొత్తగా 6 పనులకు రూ. 10.89 కోట్లతో అంచనా వేసి పనులు ప్రారంభించినా ఒక పైసా కూడా నిధులు రాక ఏదీ పూర్తికాలేదు. 2020-21, 2022-24కు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.23.74 కోట్లు పెండింగ్ ఉంది. దీంతో వీటి నిర్వహణ కష్టమైపోతోంది.



సింగవరంలో నిలిచిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

---

# ఉల్లి లొల్లి తీరలే.. టమాటా తగ్గలే!



## పెరుగుతున్న ధరలతో ప్రజలు బెంబేలు

- ధరలపై కానరాని నియంత్రణ
- ఉల్లి..టమాటా మధ్య పోటీ
- పెరుగుతూ తగ్గుతున్న ధరలు
- ఉల్లి కిలో రూ.36
- టమాటా రూ.80
- రైతు బజార్‌లోనూ మోసం
- పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 14 : అటు ఉల్లి, ఇటు టమోటా ... ఈ రెండూ ధరలతో పోటీ పడుతున్నాయి. కాస్త తగ్గినట్టే తగ్గి మళ్లీ పరుగులు పెడుతున్నాయి. చాపకింద నీరులా.. వినియోగదారులకు నొప్పి తెలియకుండా నెమ్మది నెమ్మదిగా ఉల్లిపాయల ధరలు రేజ్ అవుతుంటే.. టమాటా ధరలు మాత్రం అడ్డూ అదుపూ లేకుండా దూసుకుపోతున్నాయి. ఈ రెండూ వంటింట్లో నిత్యావసరాలు కావడంతో సామాన్య మధ్య తరగతి ప్రజానీకం ఉల్లి, టమోటా ధరల పోటీతో బెంబేలెత్తిపోతున్నారు. మహారాష్ట్ర నుంచి కొత్తపాయలు రావాలి... అనంతపురం టమోటాలు అందుకోవాలి... అప్పటి వరకూ ప్రజలకు ధరాఘాతం తప్పక పోవచ్చనే అభిప్రాయం వ్యాపారులు, అధికారుల్లో ఉంది.

### నిలకడగా పెరుగుతున్న ధరలు..

ఉల్లిపాయల ధరలు నిలకడగా పెరుగుతూనే ఉన్నాయి. మహారాష్ట్ర ఉల్లిపాయలు తప్ప మనకు మరో గత్యంతరం లేకపోవడంతో ప్రజలు పెరిగిన ధరల భారాన్ని మోయకతప్పడంలేదు. ఉల్లిపాయల ధరలు చాపకింద నీరులా రెండు మూడు రోజులకు ఒకసారి ధరల్లో స్వల్పంగా పెరుగుదల కనిపిస్తోంది. నెమ్మది నెమ్మదిగా కిలోకు రూ.2, రూ.3లు పెరుగుతుండడంతో వినియోగదారులపై వారికి తెలియకుండానే భారం పడుతోంది. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని హోల్‌సేల్ మార్కెట్లో నెంబర్ 1 రకం కిలో రూ.36లు ధర ఉంది.రెండో రకం రూ.32, మూడో రకం రూ.28-రూ.30 మధ్య అమ్ముతున్నారు. వీటినే రీటైల్ వ్యాపారులు బయట మార్కెట్లలో కిలోకు రూ.5 నుంచి రూ.10ల మార్జిన్‌తో అమ్మకాలు సాగిస్తున్నారు.రైతు బజార్లలో సెకండ్ క్వాలిటీ విక్రయిస్తున్నా కిలో రూ.36ల ధర ఉంటోంది.ఆటోలు, తోపుడుబళ్ల వ్యాపారులు రూ.100లకు కేవలం మూడు కిలోలు మాత్రమే ఇస్తున్నారంటే ధరల పెరుగుదల ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### కొత్త పంట వస్తేనే ధరలు తగ్గేది..

మహారాష్ట్ర నుంచి మాత్రమే మనకు ఉల్లిపాయలు దిగుమతి అవుతున్నాయి. కర్నాటక, కర్నూలు ఉల్లిపాయలకు సీజన్ కాకపోవడంతో మహారాష్ట్ర ఉల్లిపాయలపైనే మొత్తం మార్కెట్ ఆధారపడాలి. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి వస్తున్న ఉల్లిపాయలన్నీ ఆరుదలపాయలు. అంటే పాత పాయలు. కొత్తపాయలు వస్తేనే కానీ ధరలు తగ్గే అవకాశం లేదు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉల్లినారు వేశారని, కొత్తపంట ఆగస్టు నెలాఖరుకు కానీ రాకపోవచ్చని ఇక్కడి హోల్‌సేలర్లు స్పష్టం చేస్తున్నారు. అంటే సెప్టెంబర్‌లో కానీ ధరలు దిగొచ్చే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. కొత్తపంట లేనందువల్లనే ఉల్లిపాయల ధరల్లో భారీ పెరుగుదల కనిపిస్తున్నదని, కొత్తపాయలు వచ్చే వరకూ ధరలభారం మోయకతప్పదని పేర్కొంటున్నారు. కాగా ఉల్లిపాయలు, టమోటా ధరల పెరుగుదల నేపథ్యంలో వాటి నియంత్రణకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజానీకం కోరుకుంటున్నారు.

### కిలో టమోటా రూ.80పైనే

టమోటా ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఇటీవల టమోటా ధరలు కాస్త తగ్గినట్టు కనిపించినా ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో టమోటా రూ.80ల పైనే ధర ఉంది. రైతు బజార్లలో రూ.50లకు అమ్ముతున్నారు. ఈ ధర మరింత పెరగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా హోల్‌సేల్ వ్యాపారులందరూ మదనపల్లి, పరిసర ప్రాంతాల నుంచి టమోటా దిగుమతి చేసుకుంటున్నారు.మదనపల్లి టమోటా మాత్రమే మన అవసరాలను చాలా వరకూ తీరుస్తోంది. బెంగుళూరు టమోటా వస్తున్నా ఎక్కువ మంది మదనపల్లి టమోటాలనే వినియోగిస్తుండడంతో ధరలకు రెక్కలు వస్తున్నాయి. అనంతపురం టమోటాలు మార్కెట్లోకి అందుకుంటేనే తప్ప ఇప్పట్లో ధరలు తగ్గే పరిస్థితి లేదనే భావన ఇటు అధికారులు..అటు వ్యాపారుల్లోనూ వ్యక్తమవుతోంది.



### రైతు బజార్‌లో మోసం

రైతు బజార్‌లో మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి..అధికారులు ఉన్నా పట్టించుకోవడంలేదు.. ఉల్లిపాయల్లో దోపిడీ అంతా ఇంతా కాదు..మూడో రకం ఉల్లిపాయలు తెచ్చి మొదటిరకం రేటుతో విక్రయాలు చేస్తున్నారు.. కేజీ రూ.36లకు విక్రయాలు చేస్తున్నా నాణ్యత ఉండడం లేదు.. మూడు రకాల ఉల్లిపాయలు కలిపి విక్రయాలు జరపడం గమనార్హం.మొదటి రకం ఉల్లిపాయలు లాటుపైన వేసి కింద రెండో రకం.. మూడో రకం ఉల్లిపాయలు వేసి విక్రయాలు చేస్తు న్నారు.చూసేవారికి నాణ్యతగా ఉన్నట్టు కనిపించినా లోపల చూస్తే మాత్రం అంతా మోళీయే. అయినా ప్రశ్నించే వారు లేరు..పట్టించుకునేవారు లేరు. రైతు బజార్‌లో నిత్యం దోపిడీ జరుగుతూనే ఉంది. ఇకనైనా అధికారులు తనిఖీలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

---



కోరుకొండ- ముగ్గళ్ల ఆర్‌అండ్‌బీ రహదారిపై మునగాల వద్ద పడ్డ గండి



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

# రోడ్డుకు గండి

- వైసీపీ ప్రభుత్వ తప్పిదమే కారణం
- రెండేళ్లుగా సాగుతున్న రోడ్డు పనులు
- నేటికీ పూర్తికాలేదు.. కొట్టుకుపోయిన రోడ్డు
- 10 గ్రామాల ప్రజలకు రాకపోకలు బంద్

కోరుకొండ, జూలై 14 : వైసీపీ సగం..సగం పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ,సీతానగరం మండలాలను కలిపే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారికి మునగాల వద్ద ఆదివారం గండిపడింది. దీని కారణంగా 10 గ్రామాల ప్రజానీకం రాకపోకలు నిలిచిపోయాయి. కోరుకొండ, ముగ్గళ్ళ ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణానికి సుమారు మూడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే రెండేళ్ల కిందటే రోడ్డు పనులు ప్రారంభమైనప్పటికీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు నేటికి పూర్తి కాలేదు. ఈ రోడ్డుపై కొన్ని కల్వర్టులు, వంతెనలు నిర్మించాల్సి ఉంది. వంతెన నిర్మాణానికి సంబంధించి కాపవరం-మునగాల గ్రామాల మధ్య తోట కాలువ వద్ద కల్వర్టు నిర్మించాల్సి ఉంది. ఈ పనులకు ఇక్కడ రోడ్డు డైవర్షన్ ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతా రాహిత్యం వల్ల పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు తోట కాలువ మీదుగా వచ్చి గోదావరికి చేరే సందర్భంలో కల్వర్టు నిర్మాణం కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు గండిపడి కొట్టుకుపోయింది. సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన సుమారు 10 గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలిగింది.ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ప్రయాణీకులను శ్రీరంగపట్నం మీదుగా వెళ్లాలని అధికారులు కోరుతున్నారు. కోరుకొండ, కాపవరం,మునగాల, కూనవరం, ముగ్గళ్ళ, ఇనిగంటివారిపేట, రఘుదేవపురం, సీతానగరం గ్రామాల ప్రజలు గండిని పూడ్చాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా గండిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదివారం పరిశీలించి మునగాల గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.తక్షణం ఆర్‌అండ్‌బీ అధికారులతో గండిపూడ్చే విషయంపై చర్చించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదం రోడ్డుకు గండిపడిందన్నారు. త్వరితగతిన కోరుకొండ, ముగ్గళ్ల రహదారి గండి పూడ్చే ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులు ఎస్‌బీవీ.రెడ్డి, వీవీ మధుసూధన్‌లకు సూచించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ కోరుకొండ ముగ్గళ్ళ రహదారిలోని మునగాల సమీపంలో తోటకాలువ వద్ద మైనర్ వంతెన (కల్వర్టు) నిర్మాణంలో ఉన్న దృష్ట్యా గతంలో తాత్కాలిక రహదారి మార్గం ఏర్పాటు చేశామని, అక్కడ పైపులు ఏర్పాటు చేయకపోవడం వల్ల పై నుంచి వరద నీరు వచ్చి గండిపడిందన్నారు.తక్షణం పనులు చేపట్టి వేగవంతంచేస్తామన్నారు.

# జగన్ పాలనలో ఐటీడీఏల నిర్వీర్యం

**మూడేళ్లుగా పాలకమండలి ఆమోదాలు లేకుండానే ఆర్థిక లావాదేవీలు**

**రంప, పాడేరు, చింతూరు ఐటీడీఏలలో రూ.పదుల కోట్లలో నిధుల ఖర్చు**



రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం

(రంపచోడవరం): జగన్ పాలనలో అల్లూరి జిల్లాలోని కలెక్టర్ అధ్యక్షతన నడిచే రంపచోడవరం, చింతూరు, పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)లు నిర్వీర్యమయ్యాయి. గత మూడేళ్లుగా ఒక్కసారి కూడా పాలకమండలిని సమావేశపర్చకుండా మూడు ఐటీడీఏలకు చట్టబద్ధత లేకుండా చేశారు. పాలకమండలి ఆమోదాలు లేకుండానే ఈ మూడు ఐటీడీఏల్లో ఆర్థిక లావాదేవీలు చట్టవిరుద్ధంగా ప్రహసనంగా సాగిపోయాయి. ప్రభుత్వ శాఖగా కాకుండా స్వయం ప్రతిపత్తి సొసైటీలుగా ఏర్పాటైన ఐటీడీఏలు సొసైటీల చట్టం కింద రూపొందించుకున్న నియమావళి మేరకే నడవాల్సి ఉంది. జిల్లా కలెక్టరు అధ్యక్షుడిగానూ, పార్లమెంటు సభ్యుడు శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, స్థానిక సంస్థల మండల ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు సభ్యులుగా కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలకమండలి సమావేశమై ఎప్పటికప్పుడు కార్యాచరణ ప్రణాళికలను నిర్దేశించుకుంటూ ఆ మేరకు మాత్రమే కార్యకలాపాలను, ఆర్థిక లావాదేవీలను ఈ ఐటీడీఏ సొసైటీల్లో నిర్వహించాలి. ఏడాదికి ఒక వార్షిక సమావేశాన్ని కూడా నిర్వహించని దుస్థితిలో రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలలో ఒక్కసారి కూడా పాలకమండలి ఆమోదం తీసుకోకుండానే అధికారులు ఇష్టారాజ్యంగా పదుల సంఖ్యలో కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేశారు.. ఈ ప్రకారం ఈ ఐటీడీఏలు నిర్వీర్యమై చట్టబద్ధతను కోల్పోయాయి. నిబంధనల ప్రకారం ఐటీడీఏల ద్వారా అమలయ్యే ఏ కార్యకలాపమైనా పాలకమండలి ఆమోదంతోనే జరగాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల రాబడి, చేపట్టే కార్యక్రమాలు, ప్రణాళికలు, వ్యయాలు తదితర అంశాలన్నింటినీ పాలకమండలి ఆమోదించాల్సిందే! కానీ గత మూడేళ్లుగా ఈ ఐటీడీఏలలో పాలకమండలి ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయలతో కార్యకలాపాలు సాగాయి. రాష్ట్రంలో ఎక్కడా కూడా గడిచిన 48 సంవత్సరాలలో ఒక్క కొవిడ్ కాలంలో మినహా ఐటీడీఏల్లో పాలకమండలి సమావేశం లేని సంవత్సరమంటూ లేదు. 2019 డిసెంబరు తర్వాత రంపచోడవరం, 2021 సంవత్సరం డిసెంబరు, 28 తర్వాత చింతూరు ఐటీడీఏ, 2022 ఏప్రిల్ తర్వాత పాడేరు ఐటీడీఏల్లో పాలకమండళ్లు లేకుండానే కార్యక్రమాలన్నీ జరిగిపోయాయి. తద్వారా ఈ ఐటీడీఏల్లో అధికారులు సాగించిన కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీలకు చట్టబద్ధత లోపించింది. అంతే కాకుండా కోట్లాది రూపాయల నిధులను కూడా పాలకమండలి ఆమోదం లేకుండానే అప్పటి ప్రభుత్వ అవసరాలకు మళ్లించేశారు. సొసైటీ చట్ట నిబంధనల ప్రకారం ఇంతవరకూ సాగిన కార్యక్రమాలకు చట్టబద్ధత లేనట్టేనా అన్న ప్రశ్నలు సర్వత్రా ఉత్పన్నమవుతున్న తరుణంలో గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసి ఇప్పుడు అల్లూరి జిల్లా కలెక్టరుగా వచ్చిన దినేష్‌కుమార్ ఈ మూడు ఐటీడీఏలను అధ్యక్షుడిగా ఎలా నిర్వహిస్తారో వేచి చూడాలి..



## సత్యదేవుని భక్తుల కోసం నూతన క్యూలైన్

అన్నవరం, జూలై 14: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో రూ. 300 వ్రతం ఆచరించుకునే భక్తులకు వ్రతం అనంతరం స్వామివారి దర్శనానికి వెళ్లేందుకు ప్రత్యేక క్యూలైన్‌లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వ్రతం అనంతరం భక్తులు దర్శనం కోసం ఎండ, వానలలో బాధపడతూ దర్శనానికి చేరుకునేవారు. అంతేగాకుండా శని, ఆదివారాల్లో స్వామివారి ప్రాకారసేవ, రథోత్సవం సందర్భంగా బయటనడిచే భక్తులతో ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే రూ.300 వ్రత మండపం ఎదురుగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రత్యేక క్యూలైన్ వద్ద టీటీడీ మాదిరి కూర్చొనేందుకు బల్లలు, ఫ్యాన్లు, తాగునీరు సదుపాయం కల్పించారు. గతేడాది కార్తీకమాసంలో అప్పటి ఈవో ఆజాద్ కంపార్ట్‌మెంట్ మాదిరి ఏర్పాటుచేయగా గాలి, వెలుతురు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కోవడంతో ప్రస్తుత ఈవో దీనిని గమనించి కంపార్ట్‌మెంట్‌లను పూర్తిగా తొలగించి ఆ ప్రదేశంలో నూతన క్యూలైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరో 10 రోజుల్లో పనులు పూర్తవుతాయని శ్రావణమాసం రద్దీ నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని ఈవో రామచంద్రమోహన్ తెలిపారు.

## యువకుడి మృతదేహం లభ్యం



మోతుగూడెం,జూలై14: చింతూరు మండలం మోతుగూడెం మూడు రోజుల కింద విహారయాత్రకు వచ్చి ఫోర్‌బై రిజర్వాయర్‌లో కాలు జారిపడి గల్లంతైన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన వీరి మురళీకృష్ణ(24) మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం 10గంటలకు పోలీసులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు బెల్మాతు డాం దగ్గర మృతదేహం లభించింది. మృతదేహాన్ని చింతూరు గవర్నమెంట్ హాస్పటల్‌కి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, హెడ్ కానిస్టేబుల్ రాజు సన్నీ పాల్గొన్నారు.

### చింతలూరులో విషాదఛాయలు



ఆలమూరు, జూలై 14: మోతుగూడెం వాటర్ ఫాల్స్ వద్ద గల్లంతైన యువకుడు ఆదివారం విగతజీవిగా తేలడంతో ఆలమూరు మండలం చింతలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం చింతలూరు నుంచి పది మంది యువకులు మోతుగుడెం వద్ద వాటర్‌ఫాల్స్ దగ్గరకు వెళ్లారు. వీర మురళీకృష్ణ అనే యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి గల్లంతయ్యాడు. రెండు రోజులుగా గాలించగా ఆదివారం మృతదేహం లభ్యమైంది. దీంతో చింతలూరులోని మృతుడు మురళీకృష్ణ ఇంటి వద్దకు అతడి బంధువులు, మిత్రులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు.

## తలుపులమ్మ లోవలో భక్తుల సందడి



లోవకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు



తుని రూరల్, జూలై 14: తలుపులమ్మ లోవ క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఆషాఢ ఆదివారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల రాకతో లోవ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అమ్మవారికి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోను, కాటేజీల్లోను వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే కుంకుమార్చనల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పోలీసు యంత్రాంగం రద్దీని నియంత్రించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఈవో విశ్వనాథరాజు మాట్లాడుతూ లోవ క్షేత్రానికి 2వ ఆదివారం 40 వేల మందికి పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకోగా క్షేత్ర పరిసరాలకు లక్షకు పైగా భక్తులు వచ్చారన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా 100 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారన్నారు. వివిధ విభాగాల నుంచి రూ.11.95 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గత ఏడాది ఆషాఢ మాసం 2వ ఆదివారంతో పోల్చితే ఈ ఏడాది రూ.92 వేలు అధికంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

## సోకులేరు వాగులో పడి యువకుడి గల్లంతు



మోతుగూడెం, జూలై 14: విహార యాత్రకు వెళ్లిన ఓ యువకుడు సోకులేరు వాగులో పడి గల్లంతయ్యాడు. ఎస్ఐ జి. గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడ గుణదలకు చెందిన ఏడుగురు బీటెక్ విద్యార్థులు కారులో ఆదివారం చింతూరు మండలం చదలవాడ పంచాయతీ సోకిలేరు వ్యూ పాయింట్ దగ్గరకు విహారయాత్రకు వచ్చారు. వీరిలో ఇద్దరు అల్లూరి తేజ (24), అవినాష్ వ్యూ పాయింట్ దగ్గర ఉన్న సోకులేరువాగులో దిగి స్నానాలు చేస్తుండగా అల్లూరి తేజ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. తేజను రక్షించడానికి వెళ్లిన అవినాష్ సైతం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉంటే తోటి స్నేహితులు రక్షించండి అంటూ చేస్తున్న ఆర్తనాదాలు విని స్థానికులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని అవినాష్‌ను సురక్షితంగా బయటకు లాక్కొచ్చారు. పోలీసులు, స్నేహితులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినా తేజ ఆచూకీ లభించలేదు. దీంతో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


క్యూలో నిల్చున్న భక్తులు



పెద్దాపురం, జూలై 14 : భక్తుల కొంగు బంగారం మరిడమ్మ జాతరకు రెండో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.


క్యూలో నిల్చున్న భక్తులు

## సత్యదేవుడి ప్రసాదం కోసం..

అన్నవరం, జూలై 14: సత్యదేవుడి సన్నిధిలో అమృతతుల్యంగా భావించే స్వామివారి గోధుమరవ్వ ప్రసాదం కొనుగోలుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. తలుపులమ్మ లోవ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో తమ స్వస్థలాలకు వెళ్లే భక్తులు జాతీయ రహదారిపై నమూనాలయం వద్ద ప్రసాదం కొనుగోలుకు బారులు తీరారు. కొండపైన, కొండి దిగువున తొలిపావంచా, బైపాస్‌లో రెండు నమూనాలయాల వద్ద కలిపి సుమారు 90 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.


స్వామివారి ప్రసాదం అందిస్తున్న అధికారులు

### సమాచార కమిషనర్ పూజలు

అన్నవరం, జూలై 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా పీఆర్వో స్వామివారి ప్రసాదం అందజేశారు.

## సెప్టెంబరు 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (మంగళగిరి) ఆధ్వర్యంలో సెప్టెంబరు 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు గోదావరి ట్విన్ ఆర్ట్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి డీఎంవీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు భాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్ హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీష్‌లో జూనియర్ గ్రేడ్ పరీక్ష, హిందీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 35 కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. అలాగే తెలుగు, ఇంగ్లీషు షార్ట్ హ్యాండ్ పరీక్షలను సెప్టెంబరు 21, 22 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 6 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. విజయవాడ షార్ట్ హ్యాండ్ కేంద్రం రద్దు చేసి, గుంటూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్షలకు ఇంకా 75 రోజుల సమయం ఉన్నందున వెంటనే స్థానికంగా ఉన్న టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 31 లోగా సంప్రదించి సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలని కోరారు.

## భారీగా తాబేళ్లు స్వాధీనం

మోతుగూడెం,జూలై14:చింతూరు మండలం మీదుగా అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. చింతూరు మండలం తులసిపాక అటవీ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగాతరలిస్తున్న తాబేళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 246 తాబేళ్లను కాకినాడ నుంచి ఏజెన్సీ మీదుగా ఒడిశాకు తరలిస్తున్న ఒడిశాకు చెందిన సూరజ్ మండల్‌ను అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వాహనంలో 246 తాబేళ్లలో 230 తాబేళ్లు సజీవంగా ఉన్నాయని 16 తాబేళ్లు మృతి చెందాయని పట్టుబడ్డ తాబేళ్లను శబరి నదిలో వదిలిపెడతామని లక్కవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి నానాజీ తెలిపారు. సూరజ్‌మండల్‌ను అదుపులోకి తీసుకున్నామని ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఈ తనిఖీల్లో లక్కవరం సెక్షన్ ఆఫీసర్ విజయ్‌కుమార్, లక్కవరం బీట్ ఆఫీసర్ బి.సరిత, చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.

## పట్టుబడిన యానాం మద్యం



తాళ్లరేవు, జూలై 14: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మద్యాన్ని బోటుపై తరలిస్తుండగా గోవలంక ఇసుక ర్యాంపు వద్ద కోరింగ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామానికి చెందిన మద్యం వ్యాపారి దండుప్రోలు సతీష్ యానాం నుంచి 13 ప్లాస్టిక్ సంచుల్లో 2,340 లిక్కర్ బాటిల్స్‌ను అక్రమంగా తరలిస్తూ గోవలంక రేవు వద్ద బోటుపై తరలించేందుకు సిద్ధంగా ఉండగా పోలీసులకు వచ్చిన సమాచారం ప్రకారం కోరింగ ఎస్ఐ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. మద్యం బస్తాలను స్వాధీనం చేసుకుని బోటును సీజ్ చేశారు. దండుప్రోలు సతీష్‌పై కేసు నమోదు చేసి కాకినాడ స్పెషల్ కోర్టుకు తరలించనున్నట్లు కోరింగ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చిట్టిబాబు, పీసీలు సురేష్, చంద్ర, వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ఏటూరునాగారం శివారులో ఘోర ప్రమాదం

**కంటైనర్ లారీని ఢీకొన్న ఆటో**

**తొండంగి మండలం కోదాడకు చెందిన మహిళతో పాటు ఆమె తల్లిదండ్రులు, డ్రైవర్ దుర్మరణం**


సత్యనారాయణరాజు, సత్యవతి మృతదేహాల వద్ద రోదనలు


అనిత (ఫైల్‌ఫొటో)

వాజేడు, జూలై 14: ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారం శివారులో శనివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో తొండంగి మండలం కోదాడకు చెందిన మహిళతో పాటు ఆమె తల్లిదండ్రులు, ఆటో డ్రైవర్ మృతిచెందారు. దీంతో ఏటూరునాగారం సమీప గ్రామం వాజేడులోను, కోదాడలోను విషాదఛాయలు అలుముకున్నాయి. తొండంగి మండలం కోదాడ గ్రామానికి చెందిన తమ కూతురు సాగి అనితను వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు, సత్యవతి దంపతులు బస్సు ఎక్కించేందుకు శనివారం రాత్రి బయల్దేరారు. నాగరాజు అనే డ్రైవర్ ఆటోను కిరాయికి మాట్లాడుకున్నారు. సత్యనారాయణరాజు, సత్యవతి, అనిత ఆటో ఎక్కగా డ్రైవర్ నాగరాజు అదే గ్రామానికి చెందిన యువకుడు అంజిరెడ్డిని తోడుగా తీసుకెళ్లాడు. డ్రైవర్ సహా నలుగురు ఆటోలో బయల్దేరగా ఏటూరునాగారం శివారు హైవే ట్రీట్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డుకు అడ్డంగా ఉన్న గేదె కళేబరాన్ని తప్పించబోయిన ఆటో డ్రైవర్.. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొన్నాడు. దీంతో ఆటో డ్రైవర్ నాగరాజుతో పాటు సత్యనారాయణ, సత్యవతి దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. వారి కూతురు అనితతో పాటు ఆటోలో ఉన్న యువకుడు అంజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వీరిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిత కూడా మృతి చెందింది. అనిత మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీ నుంచే ఆమె అత్తగారి ఊరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తొండంగి మండలం కోదాడకు ఆదివారం తరలించారు. సత్యనారాయణరాజు, సత్యవతి దంపతులకు ఏకైక సంతానం అనిత. ఆమెకు కుమారుడు, కూతురు ఉన్నారు. గత ఏడాది కూతురి వివాహం చేశారు. అనిత భర్త సాగి సత్యనారాయణరాజు ఇటీవల అనారోగ్య బారిన పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు.

## 78 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 14:ధవళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 78,209 క్యూసెక్కులు మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.30 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 3 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

## నేటి నుంచి అన్నవరం రైల్వేగేటు మూసివేత

అన్నవరం, జూలై 14: అన్నవరం రైల్వేగేటును సోమవారం ఉదయం 7గంటల నుంచి గురువారం సాయంత్రం 5గంటల వరకు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేటులో సాంకేతిక సమస్యలు ఉండడంతో మరమ్మతులలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్నవరం నుంచి ఒంటిమామిడి, తొండంగి, కొత్తపల్లి వెళ్లే ప్రయాణికులు గమనించి చిన్నాయపాలెం, రావికంపాడు మీదుగా రాకపోకలు కొనసాగించుకోవాలని కోరారు.

## డయేరియా సోకి తగ్గిన వ్యక్తి మృతి

సీతానగరం, జూలై 14: డయేరియా సోకి తగ్గిన వ్యక్తి ఇంటి వద్ద చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల కేంద్రమైన సీతానగరం గ్రామానికి చెందిన పెంటా సుబ్బారావు ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. సీతానగరం పీహెచ్‌సీ డా.చైతన్య విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 2న డయేరియాతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందగా మూడు రోజులలో డయేరియా నుంచి పూర్తిగా కోలుకున్నాడని, ఈ నెల 6న ఆయాసం రావడంతో మూత్రం బంద్ కావడంతో కుటుంబ సభ్యులు సీతానగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 10న సుబ్బారావు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారని ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేయాలని ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో కుటుంబ సభ్యులు తిరస్కరించి ఇంటికి తీసుకువచ్చారని అన్నారు. అప్పటి నుంచి ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తున్నామని, ఈయనకు మూత్ర పిండాలు పనిచేయకపోవడంతో ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు



### గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

గొల్లప్రోలు, జూలై 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న కృష్ణారావు (59) ఆదివారం గుండెపోటుతో మరణించారు. కాకినాడలోని ఇంటి వద్ద ఉండగా ఆయనకు గుండెపోటు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏడాది కాలంగా ఆయన గొల్లప్రోలులో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏఎస్ఐ మృతికి పలువురు పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

### గండిపోశమ్మకు పూజలు

దేవీపట్నం, జూలై14: మండల పరిధిలో వేంచేసియున్న ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువ జాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి సంబంధించి టిక్కెట్లు తదితర వాటికి కలిపి రూ.19,700 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## పోటెత్తుతున్న వరదనీరు


(పైన) వరద ప్రవాహం పెరుగుతున్న దృశ్యం


గండిపోశమ్మ ఆలయంలోకి వరద నీరు

దేవీపట్నం, జూలై 14: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు వరదనీరు గోదావరికి వచ్చి చేరింది. దీంతో మండలంలో ముంపు గ్రామాలు గత రెండు రోజులు క్రితమే నీట మునిగాయి. గోదావరి ఉధృతి మరింత పెరగడంతో పోశమ్మ గండి వద్ద వరదనీరు పెరిగి ఆదివారం మధ్యాహ్నం అమ్మవారి ఆలయాన్ని చుట్టుముట్టింది. ఇదే వరద సోమవారం కొనసాగినట్లయితే అమ్మవారి ఆలయంలోకి వరద నీరు చేరి దర్శనాలకు బ్రేక్ పడనుంది. రెండు రోజుల క్రితం దండంగి వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వరదనీరు చేరడంతో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాలకు గండిపై ఉన్న నాలుగు పంచాయతీలకు సంబంధాలు తెగిపోయాయి.

## ఆలోచింపజేసిన నాటికలు


క్షేత్రం నాటికలోని ఓ సన్నివేశం

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 14: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా ప్రదర్శించిన క్షేత్రం నాటిక అందరినీ ఆకట్టుకుంది. కాకినాడ సూర్యకళా మందిరంలో నాలుగో రోజు కార్యక్రమాలను ఎస్ఆర్‌టీ ఇంజనీర్స్ ఎండీ బీఆర్ ప్రసాదరెడ్డి ఆదివారం రాత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆడపిల్లలపై జరుగుతున్న వివక్షతను రూపుమాపాలని కోరుతూ గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన క్షేత్రం నాటిక ప్రతిఒక్కరినీ ఆలోచింపజేసింది. ఆకురాతి శిల్ప ఈ నాటిక రచన చేయగా జి.మనోహర్ దర్శకత్వం వహించారు. తొలుత గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాలోన నీవే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళా పరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుతరామిరెడ్డి, పంపన దయానందబాబు, ఉపాధ్యక్షుడు ఎస్‌వీ ఆర్ బాపిరాజు, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ కార్యదర్శి నాదెండ్ల ప్రభుదాసు పాల్గొన్నారు.

## భారీ కొండచిలువ హతం



జగ్గంపేట రూరల్,జూలై14: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారున రాజు పొలంలో జె. కొత్తూరు గ్రామస్తులు పనిచేస్తుండగా కొండ చిలువ కనిపించింది. భయభ్రాంతులకు గురైన వెంటనే సమీప పొలంలో పని చేస్తున్న వారిని పిలిచి హతమార్చారు. ఇప్పటి వరకు ఇటువంటి కొండ చిలువను ఎప్పుడూ చూడలేదని రైతులు చెబుతున్నారు.

# తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

## ఏజెన్సీ సమాచారం

### నేడు రంపచోడవరానికి అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ రాక

రంపచోడవరం, జూలై 14: అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కలెక్టరు హోదాలో తొలిసారిగా సోమవారం రంపచోడవరం రానున్నారు. రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం మండలాల మీదుగా రంపచోడవరం చేరుకుంటారు. రంపచోడవరం మండలం సీతపల్లిలో టీటీడీ నిర్వహిస్తున్న వేంకటేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకుని రంపచోడవరం చేరుకుంటారు. అనంతరం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి చేరుకుని, అక్కడ ప్రజా వేదికను నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులతో పరిచయం అనంతరం రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షిస్తారు. గతంలో దినేష్‌కుమార్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేశారు. దీంతో పలు గిరిజన సంఘాలు కలెక్టర్‌కు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి.

### రంప ఏరియా ఆసుపత్రిపై విచారణ జరపాలి

● ఆర్ఎస్ఎస్ నాయకుడు ప్రసాద్ డిమాండ్

రంపచోడవరం, జూలై 14: రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వ్యవహారాలపై విచారణ జరిపి లోపాలను సరిదిద్ది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని రంపచోడవరం ఆర్ఎస్ఎస్ నాయకుడు కేఎల్ఎన్‌జీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంపచోడవరం కేంద్రంగా 100 పడకలతో వైద్య విధాన పరిషత్‌కు అనుబంధంగా నడుస్తున్న ఈ ఆస్పత్రిలో అనేక లోపాలు ఉన్నాయని, వైద్యులు సక్రమంగా తమ విధులను నిర్వర్తించని దుస్థితి నెలకొందని అన్నారు. ఇక గడిచిన ఐదేళ్ల కాలంలో ఆస్పత్రి అభివృద్ధి నిధులు ఎలా ఖర్చు చేశారనే అంశంలోనూ, సదరం క్యాంపుల నిర్వహణ, వాటి సర్టిఫికెట్ల జారీ అంశాలపై కూడా విచారణ జరిపించాలని అన్నారు. ఇక్కడి పరిస్థితిపై ముఖ్యమంత్రికి, వైద్యఆరోగ్య శాఖ మంత్రికి, అల్లూరి కలెక్టరుకు కూడా ఫిర్యాదులు చేస్తున్నామన్నారు.

### బాధితుడికి పరిహారం అందేలా చర్యలు చేపట్టాలి

రంపచోడవరం, జూలై 14: ఇటీవల దేవీపట్నం గ్రామానికి చెందిన ఉండమట్ల సీతారామయ్య పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తనకు రావాల్సిన ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ అందడంలేదని మనస్తాపానికిగురై ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి కార్యాలయ ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై హ్యూమన్ రైట్ వాచ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బాలు అక్కిన జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసు నెం.1070/1/29/2024ను నమోదు చేసింది. 8 వారాల్లో బాధితునికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ సూచించిందని బాధితుడు తెలిపారు.

### పశువుల షెడ్ల నిర్మాణానికి ఉపాధి పథకం అనుసంధానంపై హర్షం

రాజవొమ్మంగి జూలై 14: రైతుల కష్టాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి అనుసంధానమైన పశు పోషణకు రైతులకు ఉపయోగకరంగా ఉండే పశువుల షెడ్ల నిర్మాణాన్ని ఉపాధి పథకానికి అనుసంధానించడం హర్షదాయకమని రాజవొమ్మంగి బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు అన్నారు. సామాన్య రైతులు పశు పెంపకంతో కూడా ఆర్థికంగా బలపడేలా ఎన్డీయే ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని సూరిబాబు అన్నారు. అలానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం ఆలోచన చేస్తుందని, అన్ని రంగాలలో ప్రజలు ముందుండేలా నిర్ణయాలు తీసుకుంటుందని బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు అన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిపై జగన్ ఫొటో



రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఫొటో

వరరామచంద్రాపురం, జూలై 14: మండల పరిధి రేఖపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోను ఇప్పటి వరకు తొలగించలేదు. ప్రభుత్వం మారి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు సంబంధిత అధికారులు జగన్ ఫొటోను తొలగించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పథకాలపై, ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఫొటోలను తొలగించాలని ఆదేశాలు ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం ప్రభుత్వ ఆసుపత్రిపై ఉన్న ఫొటోను తొలగించకపోవడం గమనార్హం.

### 305 మందికి వైద్యసేవలు

రంపచోడవరం, జూలై 14: రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో సిరిగిందలపాడులో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 305 మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందాజీ తెలిపారు. వైద్యులు టి.వి. సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమామహేష్, ఎస్.సంపత్‌కుమార్ వైద్య సేవలు అందించారు. 81 మందికి రక్త పరీక్షలు, నలుగురికి థైరాయిడ్ పరీక్షలు, 13మందికి ఎక్స్‌రేలు, ఆరుగురికి ఫిజియోథెరపీ చేశారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 28మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఆరుగురికి కంటి ఆపరేషన్ల నిమిత్తం వేమగిరి పంపించారు. జి.బి.ఆర్ ఫౌండేషన్ ద్వారా డాక్టరు గోపాలం శివన్నారాయణ ఫిట్స్ క్యాంపు నిర్వహించి 75మందికి మందులు అందజేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

### 'బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం'

అడ్డతీగల, జూలై 14: అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అదే గ్రామానికి చెందిన గిరిజనుడైన వేంపాటి రమేష్ తాటియాకు ఇల్లు ఆదివారం కూలిపోవడంతో ఆ సమయంలో ఇంట్లో ఉన్న కుటుంబం ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే బీజేపీ జిల్లా కార్యదర్శి ఈరోజి స్వప్నకుమారి సంఘటన స్థలాన్ని చేరుకొని బాధిత కుటుంబాన్ని ఓదార్చి భరోసా ఇచ్చారు. స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే శిరీషాదేవికి తెలియజేయడంతో ఆమె వెంటనే స్పందించి అడ్డతీగల తహసీల్దార్, వీఆర్వో నష్టం వివరాలు సేకరించి ప్రభుత్వ సాయం వెంటనే అందజేయాలని సూచించారు. బాధిత కుటుంబానికి పక్కా గృహం మంజూరుకు చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల ప్రచార కార్యదర్శి రమేష్‌బాబు, ముర్ల సత్యనారాయణరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, వేమగిరి అర్జున్ పాల్గొన్నారు.

## ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొవ్వూరు, జూలై 14: కొవ్వూరులోని పాతవూరులో శ్రీ ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆదివారం స్థానికులు బాలప్ప ప్రసాద్, జానకి దంపతులతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గణపతిపూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి కుంకుమ పూజలు, బిల్వార్చన చేశారు. నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కొతవరపు బాను, దేవరకొండ సాయిప్రసాద్, ఉమామహేశ్వరశర్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రాచూరి ప్రసాద్, తెన్నేటి సూర్యనారాయణ, దర్భా అప్పలనరసింహమూర్తి, చల్లా సూర్యనారాయణ, వాడ్రేవు సాయి కామరాజు పాల్గొన్నారు.

# సాహితీ సభలకు వేదిక కల్పించండి

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు కళాగౌతమి సభ్యుల వినతి


ఆనం కళాకేంద్రంలో సావిత్రి క్లాసిక్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 14: కళాగౌతమి ఆధ్వర్యంలో నిర్వహించే నెలవారీ సాహిత్య కార్యక్రమాలకు తగిన ప్రదేశం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన కళాగౌతమి నెలవారీ సమావేశంలో వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ 1992లో సినీనటి భానుమతి చేతుల మీదుగా కళాగౌతమి ఆవిష్కరణ జరిగిందని, అప్పటి నుంచి పలుచోట్ల నెలవారీ సమావేశాలు జరుపుకుంటున్నామని, అయితే శాశ్వత నివాసం కోసం ఎంతమందికి ఎన్నిసార్లు చెప్పినా సాకారం కాలేదన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హయాంలో నీడ కల్పించాలని ఆయన కోరారు. దీనిపై ఆదిరెడ్డి వాసు స్పందిస్తూ విక్రమహాలు బాగుచేయించడం ద్వారా పలు సంస్థల కార్యకలాపాలు నిర్వహించు కొనే వెసులుబాటు చర్యలు తీసుకొంటామన్నారు. కళాగౌతమికి గౌరవాధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే ఉండడం ఆనవాయితీయని, ఇకపై ఎమ్మెల్యే వాసు గౌరవాధ్యక్షుడిగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పీవీబీ సంజీవరావు, బీహెచ్ రమాదేవి, శ్రీహరి జగన్నాథం, పి.విశాలాక్షి, పి.నరసింహమూర్తి, డి.నీలకంఠరావు, ఎం.మాలతి, శ్రీపాద సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

**సావిత్రి క్లాసిక్ పుస్తకావిష్కరణ**

ఇటీవల హైదరాబాద్‌లో మెగాస్టార్ చిరంజీవి ఆవిష్కరించిన సావిత్రి క్లాసిక్స్ పుస్తకాన్ని రాజమహేంద్రవరంలోనూ ఆవిష్కరించాలన్న నేపథ్యంలో స్థానిక వై-జంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సావిత్రి క్లాసిక్స్ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. నటగాయకుడు జిత్ మోహన్‌మిత్ర బృందం, నవరస నట సమాఖ్య సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వాసుతోపాటు మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, జీవీ హర్షకుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు విచ్చేశారు. తనకంటూ ఒక ఒరవడి తెచ్చుకొన్న మహానటి సావిత్రిపై పుస్తకం రాయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రచయిత సంజయ్‌కిషోర్‌ను అభినందించారు. కార్యక్రమంలో దొండపాటి సత్యంబాబు, పీవీఎస్ కృష్ణారావు, సూరపురెడ్డి తాతారావు, నూజిళ్ల సూరిబాబు, గిరిజాల సోమరాజునాయుడు, నిమ్మలపూడి గోవిందు, వి.జగపతి, అడబాల మరిడయ్య, గుంటూరు శ్రీనివాస్, బి.సీతారామారావు పాల్గొన్నారు.

## ధవళేశ్వరం ఎన్ఎంఈ చర్చిలో నిధుల దుర్వినియోగం

● ఆర్ఐ జోక్యం చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు
● చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎంఈ చర్చ్ పరిరక్షణ కమిటీ సభ్యుడు ప్రమోద్

రాజమహేంద్రవరంసిటీ, జూలై 14: ధవళేశ్వరం గ్రామంలో పురాతనమైన ఎన్ఎంఈ లూథరన్ చర్చిలో నిధులను పాస్టర్ అనిల్, ట్రెజరర్ జె.ప్రవీణ్ దుర్వినియోగం చేశారని చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు ప్రమోద్‌కుమార్, టీపీ మణికుమార్, మరో పాస్టర్ జి.కిరణ్‌కుమార్ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చర్చినిధులు సుమారు రూ.80 లక్షలు దుర్వినియోగం చేశారన్నారు. ప్రతి ఆదివారం ఆరాధన సమయంలో వస్తున్న లక్షల రూపాయల కానుకలను చర్చి ఖాతాలోకి జమచేయడంలేదని ఆరోపించారు. ఈ అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ ఆదేశాల మేరకు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్నారన్నారు. తీర్పు చర్చి పాస్టర్ జి.కిరణ్‌బాబుకి అనుకూలంగా వస్తుందనే కుట్రతో అనిల్‌కిరణ్, ప్రవీణ్..రూరల్ ఆర్ఐ సాగర్‌తో కలిసి ఆదివారం ఆరాధన చేయడానికి వచ్చిన కిరణ్‌బాబు సహా పలువురు సంఘ సభ్యులపై బైండోవర్ కేసులు పెట్టించారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ సభ్యులు జాన్‌సైమన్, ఏశావు, నం బూరి రవీంద్ర, సకిలే శేఖర్, నేతల ఇమ్మానుయేలు, సకిలే రమేష్ పాల్గొన్నారు.

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు

అనపర్తి, జూలై 14 : విజయవాడలోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు కుమార్తె డాక్టర్ సనాతనితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. వారాహి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి నల్లమిల్లి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు నల్లమిల్లి దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా నల్లమిల్లి దంపతుల వెంట కొయ్యవమూడి శ్రీనివాసరావు దంపతులు ఉన్నారు.

## లచ్చారెడ్డి మృతి నాటకరంగానికి తీరనిలోటు

● శారదా కళానికేతన్ ఆధ్వర్యంలో లచ్చారెడ్డికి ఘన నివాళి

అనపర్తి, జూలై 14 : కళాపోషకుడు తాడి లచ్చారెడ్డి మృతి నాటక రంగానికి తీరనిలోటని పలువురు ప్రముఖులు అన్నారు. అనపర్తి మండలం పొలమూరులో ఇటీవల మృతి చెందిన కళాపోషకుడు లచ్చారెడ్డి సంస్మరణ సభను ఆదివారం గ్రామంలోని శ్రీదేవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. పొలమూరులోని శారదా కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు పాల్గొని లచ్చారెడ్డి కళారంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సత్తి వీర్రాఘవరెడ్డి, తాడి సుబ్బారెడ్డి, తాడి సత్యనారాయణరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, మల్లిడి నాగిరెడ్డి, తాడి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, చేవలి శ్రీనివాస్ పాల్గొన్నారు.


కళా పోషకుడు లచ్చారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న శారదా కళానికేతన్ ప్రతినిధులు

## ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు


బహుమతులతో విజేతలైన చిన్నారులు

రాజమహేంద్రవరంకల్చరల్, జూలై 14: టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏపీ స్టేట్ ర్యాంకింగ్-2 టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ మూడోరోజు ఆదివారం అండర్-11, అండర్-15 విభాగాల్లో బాలబాలికల పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఏపీటీటీఏ కార్యదర్శి పి.విశ్వనాథ్, గుంటూరుజిల్లా అసోసియేషన్ కార్యదర్శి గురుదత్ విజేతలకు బహుమతులు అందజేశారు. రాజమహేంద్రవరం గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన మోహిత్ శ్రీ కనిష్ అండర్-11 బాలుర విభాగంలో సెమీఫైనల్స్ చేరి బ్రాంజ్ మెడల్ సాధించాడు. వర్ధమాన క్రీడాకారులకు భాస్కరరామ్ ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్య నారాయణ, పర్యవేక్షకులు వీటీవీ సుబ్బారావు, పి.వేణుగోపాలరావు, పీవీ సత్యనారాయణ, ఎల్ఎం ఎస్.జయరాజ్, ఎస్ఎస్ ఫాల్గుణ్, జి.సురేష్‌కుమార్, టి.మధుకుమార్, ఎస్.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

## రైతుల సమస్య పరిష్కారం

కడియం, జూలై 14: జేగురుపాడులో రైతులు గత కొలంగా పంటకాలువ సక్రమంగా లేకపోవడంతో పంట పొలాలు మునకకు గురవుతున్నాయని సమస్య పరిష్కరించాలని గ్రామ ఉపసర్పంచ్, టీడీపీ నాయకుడు పాతూరి రాజేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రాజేష్ ఈ విషయాన్ని ఎంపీపీ, టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. రైతుల సమస్య పరిష్కరించాలని అధికారులతో అన్నారు. ఈమేరకు ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, రైతులు పర్యవేక్షణలో హనుమాన్‌నగర్ నుంచి బుచ్చమ్మగోతి మీదుగా మెర్నిపాడు ముత్యాలమ్మ ఆలయం వరకు ఉన్న పంటబోదె అభివృద్ధి పనులు చేయించారు. రైతులు ఎంపీపీ ప్రసాద్, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, కర్రి చినబాబు, వనమాలి బాలాజీ, రైతులు ఉన్నారు.


జేగురుపాడులో పంటబోదె శుభ్రం.. పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

## క్రికెట్ కిట్‌లు పంపిణీ

కొవ్వూరు/తాళ్లపూడి, జూలై 14: యువత చదువుతో పాడు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కుమారుడు ముప్పిడి ధరన్ అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఆదివారం కొవ్వూరు మండలం పెనకనమెట్ట, తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామాల్లో యూత్‌కు క్రికెట్ కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దిపాటి ప్రకాశరావు, చెరుకూరి వెంకట్రావు, మద్దిపాటి రామారావు, కుంటముక్కల ప్రేమ్‌చంద్, గెడ్డం జగజ్జీవన్‌రావు, రాపాక శ్యాం, కిషోర్, శ్రీను పాల్గొన్నారు.

## మానవత నూతన కమిటీ ప్రమాణస్వీకారం

నల్లజర్ల, జూలై 13: మానవత సంస్థ మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం నల్లజర్లలో జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు అధ్వర్యంలో జరిగింది. నూతన కమిటీ అధ్యక్షురాలు రుద్రపాక ఝాన్సీరాణి, కార్యదర్శిగా పాతూరి రమేష్, కోశాధికారి ఐడీవీ అప్పారావు, ఈసీ మెంబర్స్ మద్దూరి విష్ణుమూర్తి, హెల్త్ బోడిగడ్ల సీతారాములు, ఇతర సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ ఛైర్మన్ కేవీఎస్ నారాయణ, దావులూరి ప్రభాకరరావు, గుత్తికొండ ప్రసాదరావు, పాతూరి సత్యనారాయణ, గుండు త్రినాథ్‌మూర్తి, కామేశ్వరరావు, బీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

## మట్టితో శివలింగాల తయారీ

చాగల్లు, జూలై 14: అనంత సంఖ్యాక పార్థివ శివలింగాలను బంక మట్టితో తయారు చేసే కార్యక్రమం చాగల్లు మెయిన్‌రోడ్డును చేర్చి ఉన్న సాయిబాబా ఆలయ ప్రాంగణలో వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. శ్రీభోగ లింగేశ్వర ధార్మికసేవా సమితి అధ్వర్యంలో కొల్లేపర మహాక్ష్మి సమక్షంలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సుమారు యాభై వేలు శివ లింగాలు తయారు చేసినట్లు తెలిపారు.

## దళితుల గురించి మాట్లాడే అర్హత జూపూడికిలేదు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 14: దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కు, అర్హత జూపూడి ప్రభాకర్‌కు లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన రాజమహేంద్రవరంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అంబేద్కర్ విదేశీవిద్య పేరు మార్చినప్పుడు, 27సంక్షేమ పథకాలు రద్దు చేసినప్పుడు, దళితులపై అన్యాయంగా దాడులు చేసినప్పుడు, అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఏనాడు జూపూడి నోరు విప్పలేదన్నారు.

## 18 నుంచి ఆర్ట్ ఆఫ్ లివింగ్ జ్ఞాన తరగతులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 14: ఆర్ట్ ఆఫ్ లివింగ్ రాజమండ్రిశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18నుంచి 21వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ అడ్వాన్స్‌డు మెడిటేషన్ కార్యక్రమం స్థానిక కృష్ణానగర్ మెడికల్ హాల్లో నిర్వహిస్తున్నారని, సాధకులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు కామాక్షి శ్రీనివాసరావును 93913 91393, 99496 01284 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఇంటింటికీ సహజ యోగా

కడియం, జూలై 14: మాతృశ్రీ నిర్మలాదేవి స్థాపించిన సహజయోగా ట్రస్ట్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ సహజయోగా కార్యక్రమాన్ని విస్తృతపరిచినట్లు రాష్ట్రశాఖ సభ్యులు ఆకుల పట్టాభిరామ్, బొళ్ళ పద్మావతిలు తెలిపారు. ఈ సహజయోగాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం సభ్యులు లక్ష్మీకుమారి తదితరులు ఉన్నారు.

## 'పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి'

దివాన్‌చెరువు, జూలై 14: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయు) రాష్ట్ర నాయకులు నూరి జయత్రినాధ్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాతతేదీతో జీపీఎస్ అమలుచేస్తూ తాజాగా ప్రభుత్వం విడుదలచేసిన రాజపత్రంను రద్దుచేయాలని కోరారు. దివాన్‌చెరువులో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన వారంరోజులలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన వైఎస్ జగన్ ఆ హామీని తుంగలో తొక్కి ఉద్యోగ ఉపాధ్యాయులను దగా చేశారని విమర్శించారు. దీంతో కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఉన్న సందర్భంలో ఈ గెజిట్ నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురయ్యారని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తక్షణం ఈ నోటిఫికేషన్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో 117ను వెంటనే రద్దుచేయాలని త్రినాధబాబు విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ నాయకులు పూడి భీమేశ్వరరావు, ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, వీరబాబు పాల్గొన్నారు.


గోకవరం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం

## ఆర్టీసీ డిపో ప్రాంగణంలో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోకవరం, జూలై 14: అపారిశుధ్యంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారిన గోకవరం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆదివారం అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. డిపో నాల్గువైపులా నిల్వఉన్న వర్షపు నీటి ని తొలగించే ప్రయత్నాలు చేశారు. చినుకు పడితే చిత్తడే అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది డిపో ఆవరణలో పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగించారు. మురుగు కూపాలవద్ద బ్లీచింగ్ చల్లడంతోపాటు, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రయాణికులకు తాగునీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలుతీసుకున్న దాఖలాలు కనిపించడంలేదు.

## పాఠశాలల పచ్చదనానికి సాయం అందిస్తా

● టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని

కడియం, జూలై 14: మొక్కలు పెంచకపోతే మనుగడ కష్టం అవుతుందని ప్రతీఒక్క రూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం వీరహనుమాన్ నర్సరీ అధినేత మార్గాని సత్యనారాయణను టీఎస్‌యూసీ రాష్ట్ర కార్యదర్శి కె.జయరాజు, గౌరవాధ్యక్షుడు వి.లజపతిరాయ్, ఎన్.శ్రీనివాస కృష్ణమూర్తి నర్సరీని సందర్శించారు. పాఠశాలల్లో స్థలం ఉండి మొక్కలు పెంచే ఉద్దేశం ఉంటే పాఠశాలల సుందరీకరణకు ఫల, పుష్పమొక్కలు అందిస్తామని మార్గాని సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యూసీ ఉపాధ్యాయ సంఘ నేతలు మార్గానిని ఘనంగా సత్కరించారు.


టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గానిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

## సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

| | |
|---|---|
| శ్యామల | : భారతీయుడు-2 |
| సూర్యామినీ | : కిల్ |
| సూర్యాప్యాలస్ | : భారతీయుడు2 |
| స్వామి | : మహరాజ |
| శివజ్యోతి | : ఓఎంజీ |
| అనుశ్రీ(సాయికృష్ణ) | : మనమే,సారంధరియా |
| రాజా | : బ్యాడ్ బాయ్స్ |
| ఊర్వశి | : భారతీయుడు-2 |
| రంభ | : 14 |
| అప్సర | : కల్కి |
| కుమారి | : రాజుయాద్ |
| అశోక | : కల్కి |
| వీఎస్ మహల్(నామవరం) | : భారతీయుడు-2 |
| మురళీకృష్ణ(ధవళేశ్వరం) | : కల్కి |
| వెంకటసూర్య(కడియం) | : భారతీయుడు-2 |
| సత్యగౌరి (అనపర్తి) | : భారతీయుడు-2 |
| సూర్యశ్రీ (అనపర్తి) | : ఆ ఒక్కటీ అడక్కు |
| ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం) | : భారతీయుడు-2 |
| రామకృష్ణ(కోరుకొండ) | : భారతీయుడు-2 |
| గీతాసినిమాస్ (సీతానగరం) | : భారతీయుడు-2 |
| శ్రీనివాస (గోకవరం) | : భారతీయుడు-2 |
| టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం) | : కల్కి |
| లలితామహల్(రంపచోడవరం) | : భారతీయుడు-2 |
| నవయుగ(చింతూరు) | : భారతీయుడు-2 |

# 917 హెక్టార్లలో వరి పంట మునక

● జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు

రాజమహేంద్రవరంరూరల్, జూలై 14: వరినాట్లు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో అధిక వర్షాలకు జిల్లాలోని 10మండలలోని లోతట్టు గ్రామాల్లో 917 హెక్టార్లు వరి పంట ఒక అడుగు వరకు మునగటం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాట్లు వేసి 15 నుంచి 16 రోజులు దశలో వున్నందున పంటకు సాధారణంగా ఏటువంటి నష్టం వాటిల్లినప్పటికీ అధిక నీటిని తక్షణమే తీసేవిధంగా డ్రైనేజీ పారుదల వ్యవస్థ ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. పంటపొలాల్లో నీరు తగ్గిన వెంటనే అత్యవసర చర్యగా ఎకరానికి 20 నుంచి 25 కిలోల యూరియాతో పాటు 10 నుంచి 15 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా పైరు వెదజల్లే ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. వాతావరణ పరిస్థితిలో తెగుళ్లలో ముఖ్యంగా పొడతెగులు ఆశించే అవకాశం ఉంటుంది. కనుక నివారణ చర్యలు నిమిత్తం హెక్సాకొజోల్ 2 ఎంఎల్ లేదా వాలిడామైసిన్ 2 ఎమ్ఎల్ ఇక లీటరు నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్లు ద్రావణాన్ని పైరు పూర్తిగా తడిసేవిధంగా పిచికారి చేయాల్సి ఉంటుందన్నారు.

## వరి పంట కాపాడుకోండి

● ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

రాజానగరం, జూలై 14: గత కొద్దిరోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ దశల్లో దెబ్బతిన్న వరి పంటను కాపాడుకోవడంపై ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ చల్లా నరసింహారావు పలుసూచనలు, సలహాలు అందించారు. సార్వా నారుమడి దశలో ఉన్న వరి పంట, విత్తనం చల్లిన 2-3రోజుల వయసులో ఉన్నప్పుడు, మూడురోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని, ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసేయడం వల్ల విత్తనం కొర గాలిపోసుకుని ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. అలాకాకుండా నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. విత్తనం 7నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5రోజుల కన్నా ఎక్కువగా నీటమునిగితే నారుమడి దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు.

## ముంపునకు గురైన వరి నాట్లు పరిశీలన

నల్లజర్ల, జూలై 14: మండలంలోని తూర్పు చోడవరం, తెలికిచర్ల గ్రామాల్లో వర్షలకు ముంపుకు గురైన వరి నాట్లను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ డొడ్డిగర్ల సువర్ణరాజు పరిశీలించారు. ఆదివారం జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, టీడీపీ నాయకులు ఉండవల్లి గోపి తమ గ్రామాల్లో వరి పంట మునిగి పోయిందని ఎమ్మెల్యేకు చెప్పడంతో ఆయన ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రుద్ర శ్రీను, దాగని శ్రీనివాస్, ఉప్పు నరేష్ పాల్గొన్నారు.

## 375 ఎకరాల్లో పంట నీట మునక

నిడదవోలు, జూలై 14: నీట మునిగిన వరిచేలలో నీటిని తొలగించి బూస్టర్ డోస్ వేసుకోవడం ద్వారా వరి మొక్కలు నిలదొక్కుకుంటాయని మండల వ్యవసాయశాఖాధికారి జి.సత్యనారాయణ అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిడదవోలు పట్టణం, మండలంలోని కలవచర్ల, కోరుపల్లి, కంసాలిపాలెం, శింగవరంలో నీట మునిగిన వరిచేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 375 ఎకరాల్లో పంట నీట మునిగిందని చెప్పారు.





## గోష్పాదేశ్వరుడికి అలంకరణ

కొవ్వూరు, జూలై 14 : ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని కొవ్వూరు గోష్పాదేశ్వర స్వామి ఆలయంలో లలితా దేవిని కూరగాయలతో శాకాంబరి మాతగా అలంకరించి విశేషపూజలు చేశారు. కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి గోష్పాదేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. లలితాదేవిని కూరగాయలతో అలంకరించి మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆ కూరగాయలతో చేసిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం రూరల్, జూలై14: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) పోర్టల్ ద్వారా తమ సమస్యను నేరుగా సీఎం కార్యాలయానికి తెలియజేయడానికి అనుమతిస్తుందన్నారు. ప్రజలు నేరుగా 1902 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్ ,మండల స్థాయిలో ఆయా ప్రధాన కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకి అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

## కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, జూలై 14 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా,లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులతో ఆలయం కళకళలా డిందిమొత్తం రూ.1,56,217లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

## గుండెపోటుతో యువకుడు మృతి



తాళ్ళపూడి, జూలై 14 : గుండెపోటుతో యువకుడు మృతిచెందాడు.తాళ్ళపూడి మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పలసపూడి ఆశీర్వాదం కుమారుడు సంజీవ్‌కుమార్ (29)కి నాలుగు రోజుల కిందట బిడ్డ పుట్టాడు.ఈ మేరకు ఆదివారం మొక్కుతీర్చుకునేందుకు కుటుంబీకులతో గౌరీపట్నం మేరీమాత ఆలయానికి వెళ్లాడు. ఆలయం వద్ద గుండెల్లో తేడాగా ఉందని చెప్పాడు. గ్యాస్ ట్రబుల్ అయి ఉంటుం దని పట్టించుకోలేదు. మొక్కు తీర్చుకుని ఆసుపత్రికి వెళదామని అనుకున్నారు. అంత కంతకూ గుండె వద్ద నొప్పి పెరుగుతూనే ఉంది. కాసేపటికి తట్టుకోలేకపో వడంతో ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. తల్లి దండ్రులు కుమారుడి మృతదేహన్ని పట్టుకుని లేరా నాన్నా అంటూ బోరున కన్నీటి పర్యంతమవడం చూపరులను కలచివేసింది.

## వెంటాడిన మృత్యువు

### ఒక లారీ ఢీకొంటే.. మరో లారీ కింద పడి మృతి

గోపాలపురం, జూలై 14 : మృత్యువు వేటాడి వెంటాడింది. ఒక వృద్ధుడు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఎగిరిపడి ఎదురుగా వస్తున్న లారీ కిందపడి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.గోపాలపురం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన సాపర్ల హరిచంద్రప్రసాద్ (60) ఆదివారం సాయంత్రం గోపాలపురం వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. గోపాలపురం శివార్లలో ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో హరిచంద్రప్రసాద్ వాహనంతో పాటు ఎగిరి కుడివైపునకు పడడంతో కొయ్యలగూడెం నుంచి రాజమహేంద్రవరం వస్తున్న లారీ అతని పైనుంచి వెళ్లింది.దీంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడన్నారు.కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## జీపీఎస్ గెజిట్ రద్దు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 14 : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జయకర్, ఏ.షరీఫ్ అన్నారు. రాజమహేంద్రవరం యూటీఎఫ్ హోంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయగలిగిన ప్రభుత్వం జీపీఎస్ గెజిట్‌ను ఎందుకు రద్దు చేయడంలేదన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉనికిని దెబ్బతీస్తున్న జీవో నెం.117ను రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. పాఠశాల విద్యా కేలండర్ ప్రకటించాలని, పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.సమావేశంలో నాయకులు విజయగౌరీ, ఈవీవీఎస్ఆర్ ప్రసాద్, శ్రీమణి, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

పనులు - 3303 | నిధులు - 764.14 కోట్లు | చేసినవి -104.63 కోట్లు

# పనులన్నీ.. పెండింగే!



వెలుగుబందలో నిలిచిన వాటర్ ట్యాంక్ నిర్మాణం

## వైసీపీ ప్రగల్భాలు.. పనులకు ఆటంకాలు

- జలజీవన్ మిషనూ ఆగిపోయే..
- పేదల కాలనీల పనులూ సాగలేదు
- గడపగడపకూ ...పెండింగే
- సీఎం డీఎఫ్ పనులూ అంతే
- అంచనాల్లో ఉపాధి పనులు
- రూ.27.51 కోట్లు పెండింగ్
- బిల్లులందక వైసీపీ నేతల గగ్గోలు
- 260 మంది లబోదిబో

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం పనులన్నీ ఒట్టి డొల్ల. అన్ని ప్రగల్భాలే. ఆరంభ శూరత్వం తప్ప.. అమలు శూన్యం. ఎక్కడి పనులు అక్కడే. రూ.కోట్లు నిధులు ఇస్తున్నట్టు చెప్పి.పనులు ఆరంభించి ఎవరికీ నిధులు ఇవ్వకుండా.. చేసిన పనులకు బిల్లులూ చెల్లించకుండా అందరినీ ముంచేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. కేవలం ఒక గ్రామీణ మంచి నీటి సరఫరా వ్యవస్థ (ఆర్‌డబ్ల్యూఎస్) ద్వారా జిల్లాలో అనేక పనులకు అంచనాలు వేయించి చివరకు తుస్ మనిపించారు..దీంతో వైసీపీ అధినేత జగన్‌ను నమ్ముకున్నవారే నట్టేట మునిగారు. జిల్లాలో మొత్తం వివిధ గ్రాంట్లు కింద 3303 పనులకు రూ.764.14 కోట్లతో అంచనా వేసి కేవలం రూ.104.63 కోట్లు విలువైన పనులు మాత్రమే చేయించారు. రూ. 27.51 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా 227 పనులు వివిధ దశల్లో ఆగిపోగా, నిధుల లేమితో 1412 పనులు అసలు ఆరంభించలేదు. ఇలా నాడు సీఎం జగన్ మాట తప్పాడు.. మడమ తిప్పాడు..

### వైసీపీ నాయకులు లబోదిబో..

జగన్ సీఎంగా ఉన్నప్పుడు సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట నిధులిస్తామని.. ప్రతి నియోజకవర్గంలోనూ పనులు చేయాలని చెప్పడంతో రూ.5లక్షల లోపు పనులు ఆరంభించారు. అయితే పనులు సాగుతున్నా డబ్బులు రాకపోవడంతో పలువురు వైసీపీ సర్పంచ్‌లు, పలువురు వైసీపీ చోటా నాయకులు ఇవాళ లబోదిబోమంటున్నారు. జగన్ మాటలు నమ్మి ఇరుక్కుపోయిన వైసీపీ చోటా లీడర్లు జిల్లాలో సుమారు 260 మంది వరకూ ఉన్నట్టు అంచనా. గడపగడపకూ వైసీపీ నేతలు ఇచ్చిన హామీలతో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇందులో ఉండడం గమనార్హం. అయితే ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ఓడిపోవడంతో ఆయా నాయకుల పరిస్థితి అయోమయంగా ఉంది. తమ బిల్లులు సెటిల్ చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఎలాగోలా తమను గట్టెక్కించాలని వేడుకుంటున్నారు. కానీ అధికారులు ఏమీ చేయలేక.. ఏదో సర్దిచెప్పి పంపించేస్తున్నారు.

### సీఎం నిధులకే దిక్కులేదు..

సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట జిల్లా లో 81 పనులకు రూ. 4.79 కోట్లతో అర్జంట్‌గా అంచనాలు వేయించారు. రూ.5లక్షలలోపు పనులన్నీ నామినేషన్ విధానం లో చేయిస్తామని అప్పటి ఎమ్మెల్యేలు చెప్పారు.వైసీపీ కార్యకర్తలు కొందరు ముందుకు వచ్చి పనులు మొదలు పెట్టారు. 29 ఆరంభించి 28 పూర్తి చేశారు.రూ.71.94 లక్షలు బిల్లులివ్వలేదు.మిగతా 52 పనులు చేయలేదు. ప్రస్తు తం చేసిన పనులకు డబ్బులందక గిజగిజలాడిపోతున్నారు.

### గడపగడపకూ నిధులకు నీరసం..

వైసీపీ చివరి రెండేళ్లలో మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎంపీలందరినీ గడపగడపకూ మన ప్రభుత్వం పేరిట ప్రజల వద్దకు పంపింది. దీనిలో భాగంగా వైసీపీ జిల్లాలో 1263 పనులకు హామీ ఇచ్చింది.ఆయా పనులకు రూ.43.58 కోట్లు ఖ ర్చ వుతుందని అంచనా వేసింది. అయితే గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వైసీపీకి చెందిన చోటా నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు.వారితో చిన్న డ్రైన్లు పనులు 820 చేయించారు. 26 పనులు ఆరంభించారు. మరో 417 పనులు ఆరంభించలేదు. చేసిన పనులకు రూ. 18.29 కోట్లు ఖర్చయింది. అందులో ఇంకా రూ. 7.38 కోట్ల బిల్లులు చెల్లించలేదు.దీంతో సదరు వైసీపీ లీడర్లు లబోదిబోమంటున్నారు.

### డీఎంఎఫ్ పట్టించుకోలేదు..

జిల్లాలో ఇసుక, ఇతర గనుల నుంచి జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) ఉంటుంది. ఇసుక అమ్మకాలు, ఇతర మినరల్స్ అమ్మకాల్లో కొంత శాతం ఫండ్‌కు కేటాయించాలి. దీంతో గ్రామాల్లో డ్రైన్ల వంటివి నిర్మించాలి. వైసీపీ ఐదేళ్లలో డీఎంఎఫ్ గురించే పట్టించుకోలేదు. అప్పటికే ఉన్న సొమ్ముతో రూ. 8.15 కోట్లతో 151 పనులకు అంచనాలు వేశారు. 43 పనులు ప్రారంభించి కేవలం 35 పూర్తిచేశారు. వాటికే రూ.కోటి బకాయి ఉండడంతో మిగతా 103 పనులు అసలు మొదలు పెట్టలేదు. 13 పనులు ఆగిపోయాయి.

### ఉపాధి పనులు హుళక్కే.

ఎంజీఎన్ఆర్ ఈజీఎస్(ఉపాధిహామీ) పథకం కింద రూ. 19.29 కోట్లతో 243 పనులకు అంచనా వేశారు. వీటితో గ్రామాల్లో సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లు నిర్మించాలి. 71 పనులు ప్రారంభించగా 25 పూర్తి చేశారు. దానికి సంబంధించి రూ.64.36 లక్షల బిల్లులు ఇవ్వకపోవడంతో 46 పనుల మధ్యలో ఆగిపోయాయి. 172 పనులను అసలు ఆరంభించకుండానే వదిలేశారు. సచివాలయాల టాయిలెట్స్ నిర్మాణానికి రూ.11.76 కోట్ల తో 392 పనులు అంచనాలు వేసి 331 పూర్తి చేశారు.ఇంకా 49 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 12 పనులు మొదలు పెట్టలేదు.ఇందులో చేసిన పనులకు ఇంకా రూ.53.76 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

### జీవం పోయిన జలజీవన్..

జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా అనేక పనులు చేయాలని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఈ పథకం గతంలో టీడీపీ ప్రభుత్వం ఉండగా మంజూరైంది. అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ వాటర్ గ్రిడ్‌తో గోదావరి నీటిని ఇంటింటికీ సరఫరా చేయాలని ప్రయత్నించారు. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ డిజైన్లను, అంచనాలు అస్తవ్యస్తం చేసింది. చివరకు రూ. 489 కోట్ల అంచనాతో 670 పనులు చేయడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు.ప్రతి గ్రామంలోని మంచినీటి వ్యవస్థను మెరుగుపరచడం పనుల లక్ష్యం.. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం. పైపులైన్లు నిర్మించడం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడం వంటి పనులు ఇందులో ఉన్నాయి. కానీ చచ్చీచెడి రూ.355 పనులు చేశారు.మరో 84 ప్రారంభించారు. 231 పనుల ప్రారంభించలేదు. కానీ చేసిన వాటికి రూ.59.55 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉండగా కొంతమాత్రమే చెల్లించారు. ఇంకా రూ.11.56 కోట్లు బిల్లులు చెల్లించలేదు. దీంతో ప్రారంభించిన పనులతో పాటు మిగతా 231 పనులు ఆగిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు, బినామీలతో పనుల్లోకి దిగిన వైసీ పీ నేతలు గగ్గోలు పెడుతున్నారు. పేదలందరికీ ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జలజీవన్ మిషన్‌కు చెందిన రూ. 176.66 కోట్లతో 376 కాలనీల్లో 497 పనులకు అంచ నాలు వేశారు. కేవలం 72 పనులు ఆరంభించి 70 చేశారు. రూ.19.20 కోట్ల బిల్లులు ఇవ్వవలసి ఉండగా కొంత మాత్రమే ఇచ్చారు. ఇంకా రూ.5.69 కోట్లు పెండింగ్ ఉంది. మిగతా 425 పనులు ఆగిపోయాయి.చేసిన వాటికీ పూర్తిగా బిల్లులు చెల్లించలేదు. మిగతా కాలనీల్లో చేయవలసిన పనులూ చేయలేదు. వెలుగుబంద కాలనీలో ఓహెచ్ఆర్ నిర్మా ణం మధ్యలోనే ఆగిపోయింది.మంచినీటి సరఫరాకు చెం దిన సీపీ డబ్ల్యూఎస్ ఎస్‌కు సంబంధించి ఆపరేషన్ అండ్ మెయింట్ నెన్స్‌కు గత మూడేళ్లగా పైసా ఇవ్వలేదు. దీని ద్వారా లక్షల మందికి మంచినీటి సరఫరా జరుగుతోంది. పురుషోత్తపట్నం, కడియం,సీతానగరం, తాళ్లపూడి, రంగంపేట మండలాల్లో ఈ పథకాలు ఉన్నాయి.కొత్తగా 6 పనులకు రూ. 10.89 కోట్లతో అంచనా వేసి పనులు ప్రారంభించినా ఒక పైసా కూడా నిధులు రాక ఏదీ పూర్తికాలేదు. 2020-21, 20223-24కు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.23.74 కోట్లు పెండింగ్ ఉంది. దీంతో వీటి నిర్వహణ కష్టమైపోతోంది.



సింగవరంలో నిలిచిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

# ఉల్లి లొల్లి తీరలే.. టమాటా తగ్గలే!



## పెరుగుతున్న ధరలతో ప్రజలు బెంబేలు

- ధరలపై కానరాని నియంత్రణ
- ఉల్లి..టమాటా మధ్య పోటీ
- పెరుగుతూ తగ్గుతున్న ధరలు
- ఉల్లి కిలో రూ.36
- టమాటా రూ.80
- రైతు బజార్‌లోనూ మోసం
- పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 14 : అటు ఉల్లి, ఇటు టమోటా ... ఈ రెండూ ధరలతో పోటీ పడుతున్నాయి. కాస్త తగ్గినట్టే తగ్గి మళ్లీ పరుగులు పెడుతున్నాయి. చాపకింద నీరులా.. వినియోగదారులకు నొప్పి తెలియకుండా నెమ్మది నెమ్మదిగా ఉల్లిపాయల ధరలు రేజ్ అవుతుంటే.. టమాటా ధరలు మాత్రం అడ్డూ అదుపూ లేకుండా దూసుకుపోతున్నాయి. ఈ రెండూ వంటింట్లో నిత్యావసరాలు కావడంతో సామాన్య మధ్య తరగతి ప్రజానీకం ఉల్లి, టమోటా ధరల పోటీతో బెంబేలెత్తిపోతున్నారు. మహారాష్ట్ర నుంచి కొత్తపాయలు రావాలి... అనంతపురం టమోటాలు అందుకోవాలి... అప్పటి వరకూ ప్రజలకు ధరాఘాతం తప్పక పోవచ్చనే అభిప్రాయం వ్యాపారులు, అధికారుల్లో ఉంది.

### నిలకడగా పెరుగుతున్న ధరలు..

ఉల్లిపాయల ధరలు నిలకడగా పెరుగుతూనే ఉన్నాయి. మహారాష్ట్ర ఉల్లిపాయలు తప్ప మనకు మరో గత్యంతరం లేకపోవడంతో ప్రజలు పెరిగిన ధరల భారాన్ని మోయకతప్పడంలేదు. ఉల్లిపాయల ధరలు చాపకింద నీరులా రెండు మూడు రోజులకు ఒకసారి ధరల్లో స్వల్పంగా పెరుగుదల కనిపిస్తోంది. నెమ్మది నెమ్మదిగా కిలోకు రూ.2, రూ.3లు పెరుగుతుండడంతో వినియోగదారులపై వారికి తెలియకుండానే భారం పడుతోంది. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని హోల్‌సేల్ మార్కెట్లో నెంబర్ 1 రకం కిలో రూ.36లు ధర ఉంది.రెండో రకం రూ.32, మూడో రకం రూ.28-రూ.30 మధ్య అమ్ముతున్నారు. వీటినే రీటైల్ వ్యాపారులు బయట మార్కెట్లలో కిలోకు రూ.5 నుంచి రూ.10ల మార్జిన్‌తో అమ్మకాలు సాగిస్తున్నారు.రైతు బజార్లలో సెకండ్ క్వాలిటీ విక్రయిస్తున్నా కిలో రూ.36ల ధర ఉంటోంది.ఆటోలు, తోపుడుబళ్ల వ్యాపారులు రూ.100లకు కేవలం మూడు కిలోలు మాత్రమే ఇస్తున్నారంటే ధరల పెరుగుదల ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### కొత్త పంట వస్తేనే ధరలు తగ్గేది..

మహారాష్ట్ర నుంచి మాత్రమే మనకు ఉల్లిపాయలు దిగుమతి అవుతున్నాయి. కర్నాటక, కర్నూలు ఉల్లిపాయలకు సీజన్ కాకపోవడంతో మహారాష్ట్ర ఉల్లిపాయలపైనే మొత్తం మార్కెట్ ఆధారపడాలి. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి వస్తున్న ఉల్లిపాయలన్నీ ఆరుదలపాయలు. అంటే పాత పాయలు. కొత్తపాయలు వస్తేనే కానీ ధరలు తగ్గే అవకాశం లేదు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉల్లినారు వేశారని, కొత్తపంట ఆగస్టు నెలాఖరుకు కానీ రాకపోవచ్చని ఇక్కడి హోల్‌సేలర్లు స్పష్టం చేస్తున్నారు. అంటే సెప్టెంబర్‌లో కానీ ధరలు దిగొచ్చే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. కొత్తపంట లేనందు వల్లనే ఉల్లిపాయల ధరల్లో భారీ పెరుగుదల కనిపిస్తున్నదని, కొత్తపాయలు వచ్చే వరకూ ధరలభారం మోయకతప్పదని పేర్కొంటున్నారు. కాగా ఉల్లిపాయలు, టమోటా ధరల పెరుగుదల నేపథ్యంలో వాటి నియంత్రణకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజానీకం కోరుకుంటున్నారు.



### కిలో టమోటా రూ.80పైనే

టమోటా ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఇటీవల టమోటా ధరలు కాస్త తగ్గినట్టు కనిపించినా ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో టమోటా రూ.80ల పైనే ధర ఉంది. రైతు బజార్లలో రూ.50లకు అమ్ముతున్నారు. ఈ ధర మరింత పెరగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా హోల్‌సేల్ వ్యాపారులందరూ మదనపల్లి, పరిసర ప్రాంతాల నుంచి టమోటా దిగుమతి చేసుకుంటున్నారు.మదనపల్లి టమోటా మాత్రమే మన అవసరాలను చాలా వరకూ తీరుస్తోంది. బెంగుళూరు టమోటా వస్తున్నా ఎక్కువ మంది మదనపల్లి టమోటాలనే వినియోగిస్తుండడంతో ధరలకు రెక్కలు వస్తున్నాయి. అనంతపురం టమోటాలు మార్కెట్లోకి అందుకుంటేనే తప్ప ఇప్పట్లో ధరలు తగ్గే పరిస్థితి లేదనే భావన ఇటు అధికారులు..అటు వ్యాపారుల్లోనూ వ్యక్తమవుతోంది.

### రైతు బజార్‌లో మోసం

రైతు బజార్‌లో మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి..అధికారులు ఉన్నా పట్టించుకోవడంలేదు.. ఉల్లిపాయల్లో దోపిడీ అంతా ఇంతా కాదు..మూడో రకం ఉల్లిపాయలు తెచ్చి మొదటిరకం రేటుతో విక్రయాలు చేస్తున్నారు.. కేజీ రూ.36లకు విక్రయాలు చేస్తున్నా నాణ్యత ఉండడం లేదు.. మూడు రకాల ఉల్లిపాయలు కలిపి విక్రయాలు జరపడం గమనార్హం.మొదటి రకం ఉల్లిపాయలు లాటుపైన వేసి కింద రెండో రకం.. మూడో రకం ఉల్లిపాయలు వేసి విక్రయాలు చేస్తు న్నారు.చూసేవారికి నాణ్యతగా ఉన్నట్టు కనిపించినా లోపల చూస్తే మాత్రం అంతా మోళీయే. అయినా ప్రశ్నించే వారు లేరు..పట్టించుకునేవారు లేరు. రైతు బజార్‌లో నిత్యం దోపిడీ జరుగుతూనే ఉంది. ఇకనైనా అధికారులు తనిఖీలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



కోరుకొండ- ముగ్గళ్ల ఆర్‌అండ్‌బీ రహదారిపై మునగాల వద్ద పడ్డ గండి



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

# రోడ్డుకు గండి

- వైసీపీ ప్రభుత్వ తప్పిదమే కారణం
- రెండేళ్లుగా సాగుతున్న రోడ్డు పనులు
- నేటికీ పూర్తికాలేదు.. కొట్టుకుపోయిన రోడ్డు
- 10 గ్రామాల ప్రజలకు రాకపోకలు బంద్

కోరుకొండ, జూలై 14 : వైసీపీ సగం..సగం పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ,సీతానగరం మండలాలను కలిపే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారికి మునగాల వద్ద ఆదివారం గండిపడింది. దీని కారణంగా 10 గ్రామాల ప్రజానీకం రాకపోకలు నిలిచిపోయాయి. కోరుకొండ, ముగ్గళ్ళ ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణానికి సుమారు మూడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే రెండేళ్ల కిందటే రోడ్డు పనులు ప్రారంభమైనప్పటికీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు నేటికి పూర్తి కాలేదు. ఈ రోడ్డుపై కొన్ని కల్వర్టులు, వంతెనలు నిర్మించాల్సి ఉంది. వంతెన నిర్మాణానికి సంబంధించి కాపవరం-మునగాల గ్రామాల మధ్య తోట కాలువ వద్ద కల్వర్టు నిర్మించాల్సి ఉంది. ఈ పనులకు ఇక్కడ రోడ్డు డైవర్షన్ ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతా రాహిత్యం వల్ల పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు తోట కాలువ మీదుగా వచ్చి గోదావరికి చేరే సందర్భంలో కల్వర్టు నిర్మాణం కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు గండిపడి కొట్టుకుపోయింది. సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన సుమారు 10 గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలిగింది.ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ప్రయాణీకులను శ్రీరంగపట్నం మీదుగా వెళ్లాలని అధికారులు కోరుతున్నారు. కోరుకొండ, కాపవరం,మునగాల, కూనవరం, ముగళ్ళ, ఇనిగంటివారిపేట, రఘుదేవపురం, సీతానగరం గ్రామాల ప్రజలు గండిని పూడ్చాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా గండిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదివారం పరిశీలించి మునగాల గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.తక్షణం ఆర్‌అండ్‌బీ అధికారులతో గండిపూడ్చే విషయంపై చర్చించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదం రోడ్డుకు గండిపడిందన్నారు. త్వరితగతిన కోరుకొండ, ముగ్గళ్ల రహదారి గండి పూడ్చే ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులు ఎస్‌బీవీ.రెడ్డి, వీవీ మధుసూధన్‌లకు సూచించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ కోరుకొండ ముగ్గళ్ళ రహదారిలోని మునగాల సమీపంలో తోటకాలువ వద్ద మైనర్ వంతెన (కల్వర్టు) నిర్మాణంలో ఉన్న దృష్ట్యా గతంలో తాత్కాలిక రహదారి మార్గం ఏర్పాటు చేశామని, అక్కడ పైపులు ఏర్పాటు చేయకపోవడం వల్ల పై నుంచి వరద నీరు వచ్చి గండిపడిందన్నారు.తక్షణం పనులు చేపట్టి వేగవంతంచేస్తామన్నారు.

## పిల్లల్లో నైపుణ్యాన్ని గుర్తించాలి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 14: పిల్లల్లో దాగివున్న నైపుణ్యాన్ని గుర్తించి శిక్షణ అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదుగుతారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొవ్వూరులోని శ్రీరస్తు, శుభమస్తు ఫంక్షన్ హాల్లో నమో క్రికెట్ టోర్నమెంటు చాంపియన్ సీజన్-1 విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలు విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యాలను గుర్తించి, చిన్నతనం నుంచి శిక్షణ అందించాలన్నారు. క్రీడాపోటీలు ఏర్పాటు చేయడం ద్వారా పోటీతత్వాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్న, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి రామారావు

కొవ్వూరు, జూలై 14: ఈ నెల 18నుంచి 28వ తేదీ వరకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిందని నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు తెలిపారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ సమీపంలోని జనసేన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాలమేరకు ఈ నెల 18 నుంచి పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదుకు పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చిందని, అందుకు నియోజకవర్గంలో 50 మంది వలంటీర్లను నియమించనున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 15న పార్టీ ఇన్‌చార్జి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

## ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన



అభిషేకం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, జూలై 14: కొవ్వూరులోని పాతవూరులో శ్రీ ఉమా చోడేశ్వర స్వామికి లక్ష బిళ్వార్చన నిర్వహించారు. ఆదివారం స్థానికులు బాలప్ప ప్రసాద్, జానకి దంపతులతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గణపతిపూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి కుంకుమ పూజలు, బిళ్వార్చన చేశారు. నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయార్చకులు కౌతవరపు బాను, దేవరకొండ సాయిప్రసాద్, ఉమామహేశ్వరశర్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రాచూరి ప్రసాద్, తెన్నేటి సూర్యనారాయణ, దర్భా అప్పలనరసింహమూర్తి, చల్లా సూర్యనారాయణ, వాడ్రేవు సాయి కామరాజు పాల్గొన్నారు.

## కోరుమామిడిలో ఉచిత మెగా వైద్య శిబిరం



కోరుమామిడిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 14: వాసవి క్లబ్స్ సమాజంలో విద్యా వైద్య రంగాల ద్వారా అనేక సేవలు అందిస్తోందని రీజినల్ ఛైర్‌పర్సన్ జయవరపు లక్ష్మీ అన్నారు. మండలంలోని కోరుమామిడిలో బచ్చు లక్ష్మయ్య పుల్లమ్మ దంపతుల జ్ఞాపకార్థం సిరి ఎమర్జెన్సీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ 112 మందికి వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, విషజ్వరాలు ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీవీవీ లక్ష్మణరావు (నాని), మాదేటి కామేశ్వరరావు, ఉప్పల సతీష్, కేదారిశెట్టి సత్యనారాయణ, కొనిజేటి సురేష్‌కుమార్ తదితర్లు పాల్గొన్నారు.

## క్రికెట్ కిట్‌లు పంపిణీ

కొవ్వూరు/తాళ్లపూడి, జూలై 14: యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కుమారుడు ముప్పిడి ధరన్ అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఆదివారం కొవ్వూరు మండలం పెనకనమెట్ట, తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామాల్లో యూత్‌కు క్రికెట్ కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దిపాటి ప్రకాశరావు, చెరుకూరి వెంకట్రావు, మద్దిపాటి రామారావు, కుంటముక్కల ప్రేమ్‌చంద్, గెడ్డం జగజ్జీవన్‌రావు, రాపాక శ్యాం, కిషోర్, శ్రీను పాల్గొన్నారు.

## మానవత నూతన కమిటీ ప్రమాణస్వీకారం

నల్లజర్ల, జూలై 13: మానవత సంస్థ మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం నల్లజర్లలో జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు అధ్యర్యంలో జరిగింది. నూతన కమిటీ అధ్యక్షురాలు రుద్రపాక ఝాన్సీరాణి, కార్యదర్శిగా పాతూరి రమేష్, కోశాధికారి ఐడీవీ అప్పారావు, ఈసీ వేర్‌నెస్ మద్దూరి విస్సుమూర్తి, హెల్త్ బోడిగడ్ల సీతారాములు, ఇతర సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ ఛైర్మన్ కేవీఎస్ నారాయణ, దావులూరి ప్రభాకరావు, గుత్తికొండ ప్రసాదరావు, పాతూరి సత్యానారాయణ, గుండు త్రినాథ్‌మూర్తి, కామేశ్వరరావు, బీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

## మట్టితో శివలింగాల తయారీ



చాగల్లులో మట్టితో శివలింగాలు తయారు చేస్తున్న మహిళలు

చాగల్లు, జూలై 14: అనంత సంఖ్యాక పార్థివ శివలింగాలను బంక మట్టితో తయారు చేసే కార్యక్రమం చాగల్లు మెయిన్‌రోడ్డును చేర్చి ఉన్న సాయిబాబా ఆలయ ప్రాంగణలో వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. శ్రీభోగ లింగేశ్వర ధార్మికసేవా సమితి ఆధ్వర్యంలో కొల్లేపర మహర్షి సమక్షంలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సుమారు యాభై వేలు శివ లింగాలు తయారు చేసినట్టు తెలిపారు. వంద మంది మహిళలు ఈ కార్యక్రమలో పాల్గొంటుండగా వారందరికీ అన్నదానం నిర్వహిస్తున్నారు.

## ఇంటింటికీ సహజ యోగా

కడియం, జూలై 14: మాతృశ్రీ నిర్మలాదేవి స్థాపించిన సహజయోగా ట్రస్ట్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ సహజ యోగా కార్యక్రమాన్ని విస్తృత పరిచినట్టు రాష్ట్రశాఖ సభ్యులు ఆకుల పట్టాభిరామ్, బోళ్ల పద్మావతి తెలిపారు. ఈ సహజ యోగాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అనేక మంది ఆత్మసాక్షాత్కారం పొందారన్నారు. ఈ యోగా ద్వారా ఒత్తిడిని జయించి మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయన్నారు.

## సముద్రంలోకి 78 వేల క్యూసెక్కులు..

ధవళేశ్వరం, జూలై 14: ధవళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తుంది. ఆదివారం సాయత్రంం క్యాటన్ బ్యారేజ్ నుంచి 78,209 క్యూసెక్కులు మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.30 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 3వేల క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1200 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

# అనాలోచిత విధానాలతో పంటల ముంపు

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- ముంపునకు గురైన వరి పొలాల పరిశీలన

గోపాలపురం, జూలై 14: గత పాలకుల అనాలోచిత విధానాలతో ప్రతీ ఏటా ముంపుకు గురవుతున్న పంటలను పరిశీలించడమే కాకుండా కాల్వ ఆధునీకరణ పనులు పూర్తి చేసి వచ్చే ఏడాదికి ప్రక్షాళన చేస్తానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి రెవెన్యూ పరిధిలోని పంట పొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. అలాగే వెంకటాయపాలెం శివారులో ఓ వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను పరిశీలించి నియోజకవర్గ పరిధిలో కొవ్వాడ కాల్వ ఆధునీకరణకు అవసరమైన విస్తీర్ణం, రైతుల సంఖ్య, పంటపొలాల వివరాలు సేకరించి ప్రణాళికతో కూడిన నివేదికను రూపొందించాలని వ్యవసాయాధికారి రాజారావును ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ఏటా ఎమ్మెల్యేలు రావడం ముంపుకు గురైన పంట పొలాలను పరిశీలించడం తప్ప కొవ్వాడ కాల్వకు పంట ముంపు బారిన పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం నీటిప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే ఏడాదికి కాల్వలు ఆధునీకరణ పనులు పూర్తి చేసి రైతులకు అండగా నిలబడతానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా రైతులు కొవ్వాడ కాల్వ కారణంగా ఏటా పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాల్వ ఆధునీకరణ చేసి ముంపు బారిన పడకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 500 ఎకరాల్లో వరినాట్లు నీటమునిగినట్లు అధికారులు అంచనా వేశారు. అనంతరం ఇటీవల అమెరికాలోని జలపాతంలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన సాయి సూర్య అవినాష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు హరిబాబు, నూతంగి దొరబాబు, కొర్లపాటి రాము, దుర్గారావు, కాండ్రేగుల శ్రీహరి, కాండ్రేగుల మోహన్, వేగి సుధాకర్, ఈలి శరత్‌బాబు, జ్యేష్ట శ్రీధర్ పాల్గొన్నారు.



గోపాలపురం: చిట్యాలలో నీట మునిగిన వరిచేలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



నిడదవోలు మండలంలో వరిచేలను పరిశీలిస్తున్న ఏవో సత్యనారాయణ

### ముంపునకు గురైన వరి నాట్లు పరిశీలన

నల్లజర్ల, జూలై 14: మండలంలోని తూర్పు చోడవరం, తెలికిచర్ల గ్రామాల్లో వర్షాలకు ముంపుకు గురైన వరి నాట్లను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ డొడ్డిగర్ల సువర్ణరాజు పరిశీలించారు. ఆదివారం జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, టీడీపీ నాయకులు ఉండవల్లి గోపి తమ గ్రామాల్లో వరి పంట మునిగి పోయిందని ఎమ్మెల్యేకు చెప్పడంతో ఆయన ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రుద్ర శ్రీను, దాగని శ్రీనివాస్, ఉప్పు నరేష్ పాల్గొన్నారు.

### 375 ఎకరాల్లో పంట నీట మునక

నిడదవోలు, జూలై 14: నీట మునిగిన వరిచేలలో నీటిని తొలగించి బూస్టర్ డోస్ వేసుకోవడం ద్వారా వరి మొక్కలు నిలదొక్కుకుంటాయని మండల వ్యవసాయశాఖాధికారి జి.సత్యనారాయణ అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిడదవోలు పట్టణం, మండలంలోని కలవచర్ల, కోరుపల్లి, కంసాలిపాలెం, శింగవరంలో నీట మునిగిన వరిచేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 375 ఎకరాల్లో పంట నీట మునిగిందని చెప్పారు. నీట మునిగిన వరిచేల నుంచి నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనంతరం బూస్టర్‌డోస్‌గా ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాషియం, వేసుకోవాలన్నారు. దీంతో పాటు జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేసుకుంటే వరి పంట నిలదొక్కుకుంటుందని చెప్పారు.

# పాత పింఛను విధానాన్ని అమలు చేయాలి

- జీవో 17ను రద్దుచేయాలి.. ప్రాథమిక విద్యను కాపాడాలి
- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు

కొవ్వూరు, జూలై 14: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఉపాధ్యాయులు కోరారు. ఆదివారం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు డి.దుర్గారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా సంస్కరణల పేరుతో జీవో 117తో పల్లెల్లో ప్రాథమిక విద్య నిట్ట నిలువునా చీలిందన్నారు. పాఠశాలలు విలీనంతో విద్యార్థులు ఇతర గ్రామాలకు వెళ్లి చదవ వలసి వస్తుందని, దీని వల్ల డ్రాప్ అవుట్స్ పెరిగి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోయిందన్నారు. ఉపాధ్యాయులు 42 పీరియడ్‌లతో తీవ్ర పని భారం పెరిగిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో 93 కంటే తక్కువ విద్యార్థుల నమోదు ఉంటే ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు పోస్టులు రద్దు, 137 కంటే తక్కువ ఉంటే విలీన ఉన్నత పాఠశాలల్లో సైతం వ్యాయామ, ప్రధానోపాధ్యాయుల పోస్టులను తీసివేయడం ఉన్నత పాఠశాల విద్యను అతలాకుతలం చేసిందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం జీవో 117ను రద్దుచేసి పాఠశాలల విలీనాన్ని రద్దుచేయాలన్నారు. ప్రాథమిక విద్య 5వ తరగతి వరకు ఉన్న ఊరిలోనే చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 1,3,5 కిలోమీటర్ల పరిధిలో ఉండేలా, సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని ఎమ్మెల్యేకు ఏపీటీఎఫ్ నాయకులు విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు అనితజ్యోతి, జోనల్ కన్వీనర్ సలీం, రఘువీర్, యాదం శంకరం, నాని, వీరాస్వామి, తాతారావు, మోహనరావు, కొండేపాటి శ్రీనివాస్, భద్రాచలం, గొల్లపల్లి కృష్ణ, జి.విజయకుమార్‌రాజు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే ముప్పిడిని కలిసి సమస్యలు వివరిస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

# సాహితీ సభలకు నీడ కల్పించండి

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు కళాగౌతమి సభ్యుల వినతి**



ఆనం కళాకేంద్రంలో సావిత్రి క్లాసిక్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 14: కళాగౌతమి ఆధ్వర్యంలో నిర్వహించే నెలవారీ సాహిత్య కార్యక్రమాలకు తగిన ప్రదేశం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన కళాగౌతమి నెలవారీ సమావేశంలో వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ 1992లో సినీనటి భానుమతి చేతుల మీదుగా కళాగౌతమి ఆవిష్కరణ జరిగిందని, అప్పటి నుంచి పలుచోట్ల నెలవారీ సమావేశాలు జరుపుకుంటున్నామని, అయితే శాశ్వత నివాసం కోసం ఎంతమందికి ఎన్నిసార్లు చెప్పినా సాకారం కాలేదన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హయాంలో నీడ కల్పించాలని ఆయన కోరారు. దీనిపై ఆదిరెడ్డి వాసు స్పందిస్తూ విక్రమహాలు బాగుచేయించడం ద్వారా పలు సంస్థల కార్యకలాపాలు నిర్వహించు కొనే వెసులుబాటు చర్యలు తీసుకొంటామన్నారు. కళాగౌతమికి గౌరవాధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే ఉండడం ఆనవాయితీయని, ఇకపై ఎమ్మెల్యే వాసు గౌరవాధ్యక్షుడిగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పీవీబీ సంజీవరావు, బీహెచ్ రమాదేవి, శ్రీహరి జగన్నాథం, పి.విశాలాక్షి, పి.నరసింహమూర్తి, డి.నీలకంఠరావు, ఎం.మాలతి, శ్రీపాద సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

### సావిత్రి క్లాసిక్ పుస్తకావిష్కరణ

ఇటీవల హైదరాబాద్‌లో మెగాస్టార్ చిరంజీవి ఆవిష్కరించిన సావిత్రి క్లాసిక్స్ పుస్తకాన్ని రాజమహేంద్రవరంలోనూ ఆవిష్కరించాలన్న నేపథ్యంలో స్థానిక వై-జంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సావిత్రి క్లాసిక్స్ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. నటగాయకుడు జిత్ మోహన్‌మిత్ర బృందం, నవరస నట సమాఖ్య సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వాసుతోపాటు మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, జీవీ హర్షకుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు విచ్చేశారు. తనకంటూ ఒక ఒరవడి తెచ్చుకొన్న మహానటి సావిత్రిపై పుస్తకం రాయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రచయిత సంజయ్‌కిషోర్‌ను అభినందించారు. కార్యక్రమంలో దొండపాటి సత్యంబాబు, పీవీఎస్ కృష్ణారావు, సూరపురెడ్డి తాతారావు, నూజిళ్ల సూరిబాబు, గిరిజాల సోమరాజునాయుడు, నిమ్మలపూడి గోవిందు, వి.జగపతి, అడబాల మరిడయ్య, గుంటూరు శ్రీనివాస్, బి.సీతారామారావు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో పారిశుధ్య చర్యలు

గోకవరం, జూలై 14: అపారిశుధ్యంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారిన గోకవరం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆదివారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. 'చినుకు పడితే చిత్తడే' శీర్షికన ఆంధ్రజ్యోతి పత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం డిపో నాలుగు వైపులా నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించే ప్రయత్నాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది డిపో ఆవరణలో పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగించారు. మురికి కూపాల వద్ద బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రయాణికులకు తాగునీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టవలసి ఉంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గోకవరం ఆర్టీసీ డిపో వద్ద పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

## డయేరియా సోకి తగ్గిన వ్యక్తి మృతి

సీతానగరం, జూలై 14: డయేరియా సోకి తగ్గిన, సీతానగరం గ్రామానికి చెందిన పెంటా సుబ్బారావు ఇంటి వద్ద చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 2న డయేరియాతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందగా మూడు రోజుల్లో డయేరియా నుంచి పూర్తిగా కోలుకున్నాడన్నారు. ఈ నెల 6న తనకు ఆయాసం రావడంతో మూత్రం బంద్ కావడంతో కుటుంబ సభ్యులు సీతానగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 10న సుబ్బారావు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారని ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేయాలని ఆసుపత్రివర్గాలు చెప్పారు. అయితే అందుకు కుటుంబ సభ్యులు తిరస్కరించి ఇంటికి తీసుకొచ్చారన్నారు. అప్పటి నుంచి ఇంటి వద్దనే వైద్యసేవలు అందిస్తున్నామని, ఈయనకు మూత్రపిండాలు పని చేయకపోవడంతో పేగులు తీవ్రంగా దెబ్బతిని ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్టు తెలిపారు.

## వర్షాల నుంచి వరి పంట కాపాడుకోండి

**ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు**

రాజానగరం, జూలై 14: కొద్దిరోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ దశల్లో దెబ్బతిన్న వరి పంటను కాపాడుకోవడంపై ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ చల్లా నరసింహారావు పలు సూచనలు, సలహాలు అందించారు. సార్వా నారు మడి దశలో ఉన్న వరి పంట, విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో ఉన్నప్పుడు, మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని, ఈ దశలో వీలైనంత త్వరగా నీటిని పూర్తిగా బయటకు తీసేయడం వల్ల విత్తనం కోర గాలిపోసుకుని ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. అలా కాకుండా నీరు తీయడానికి వీల్లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవాలన్నారు. విత్తన 7నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారుమడి దెబ్బతింటుందన్నారు. నీరు బయటకు తీసేసిన తర్వాత 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు తొడిగి ఊడ్పులకు అందుతుందన్నారు. అధిక వర్షాలకు నారు మడి దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసి మొక్క నిలదొక్కుకున్న తర్వాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం+ మాంకోజెబ్ కలిసిన మిశ్రమ మందుగానీ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

## ఓపీఎస్ పునరుద్ధరించాలి

దివాన్‌చెరువు, జూలె 14: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయు) రాష్ట్ర నాయకుడు సూరి జయత్రినాథ్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాతతేదీతో జీపీఎస్ అమలు చేస్తూ తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని రద్దుచేయాలని కోరారు. దివాన్‌చెరువులో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన వైఎస్ జగన్ దానిని తుంగలో తొక్కి ఉద్యోగ ఉపాధ్యాయులను దగా చేసి జీపీఎస్ అనే దిక్కుమాలిన విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. దీంతో కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు.. ఈ గెజిట్ నోటిఫికేషన్ రావడంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు గురయ్యారన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తక్షణం ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విద్యారంగానికి జీవో 117ను రద్దుచేయాలని త్రినాథబాబు విజ్ఞప్తి చేశారు.

## సెప్టెంబరు 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు

**గోదావరి ట్విన్ ఆర్ట్స్ అసోసియేషన్ నాయకుడు ప్రసాద్**

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (మంగళగిరి) ఆధ్వర్యంలో సెప్టెంబరు 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు గోదావరి ట్విన్‌ఆర్ట్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి డీఎంవీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు భాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్ హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీష్‌లో జూనియర్ గ్రేడ్ పరీక్ష, హిందీలో లోయర్, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 35 కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. అలాగే తెలుగు, ఇంగ్లీషు షార్ట్ హ్యాండ్ పరీక్షలను సెప్టెంబరు 21, 22 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 6 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. విజయవాడ షార్ట్ హ్యాండ్ కేంద్రం రద్దు చేసి, గుంటూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్షలకు ఇంకా 75 రోజుల సమయం ఉన్నందున వెంటనే స్థానికంగా ఉన్న టైప్ ఇన్‌స్టిట్యూట్‌ని ఈనెల 31 లోగా సంప్రదించి సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలని కోరారు.

## ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేసిన ముఖ్యఅతిథులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 14: టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏపీ స్టేట్ ర్యాంకింగ్-2 టేబుల్ టెన్నిస్ టోర్నమెంటు మూడో రోజు ఆదివారం అండర్-11, అండర్-15 విభాగాల్లో బాలబాలికల పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీటీటీఏ కార్యదర్శి పి.విశ్వనాథ్, గుంటూరు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గురుదత్ విజేతలకు బహుమతులు అందజేశారు. రాజమహేంద్రవరం గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన మోహిత్ శ్రీకనిష్ అండర్-11 బాలుర విభాగంలో సెమీ ఫైనల్స్ చేరి బ్రాంజ్ మెడల్ సాధించాడు. వర్ధమాన క్రీడాకారులకు భాస్కరరామ్ ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ(భీము), పర్యవేక్షకులు వీటీవీ సుబ్బారావు, పి.వేణుగోపాలరావు, పీవీ సత్యనారాయణ, ఎల్ఎంఎస్ జయరాజ్, ఎస్ఎస్ ఫాల్గుణ్, జి.సురేష్‌కుమార్, టి.మధుకుమార్, ఎస్.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## 18 నుంచి ఆర్ట్ ఆఫ్ లివింగ్ జ్ఞాన తరగతులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 14: ఆర్ట్ ఆఫ్ లివింగ్ రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18నుంచి 21వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ అడ్వాన్స్‌డు మెడిటేషన్ కార్యక్రమం స్థానిక కృష్ణానగర్ మెడికల్ హాల్లో నిర్వహిస్తున్నారని, సాధకులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు కామాక్షి శ్రీనివాసరావును 93913 91393, 99496 01284 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఎన్ఎంఈ చర్చిలో నిధుల దుర్వినియోగం

**ఆర్ఐ జోక్యం చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారు**

**చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎంఈ చర్చి పరిరక్షణ కమిటీ సభ్యుడు ప్రమోద్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14: ధవళేశ్వరం గ్రామంలో పురాతనమైన ఎన్ఎంఈ లూథరన్ చర్చిలో నిధులను పాస్టర్ అనిల్, ట్రెజరర్ జె.ప్రవీణ్ దుర్వినియోగం చేశారని చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు ప్రమోద్‌కుమార్, టీపీ మణికుమార్, మరో పాస్టర్ జి.కిరణ్‌కుమార్ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చర్చి నిధులు సుమారు రూ.80 లక్షలు దుర్వినియోగం చేశారన్నారు. ప్రతి ఆదివారం ఆరాధన సమయంలో వస్తున్న లక్షల రూపాయల కానుకలను చర్చి ఖాతాలోకి జమచేయడం లేదని ఆరోపించారు. ఈ అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ ఆదేశాల మేరకు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్నారన్నారు. అయితే తీర్పు చర్చి పాస్టర్ జి.కిరణ్‌బాబుకి అనుకూలంగా వస్తుందనే కుట్రతో అనిల్‌కిరణ్, ప్రవీణ్.. రూరల్ ఆర్ఐ సాగర్‌తో కలిసి ఆదివారం ఆరాధన చేయడానికి వచ్చిన కిరణ్‌బాబు సహా పలువురు సంఘ సభ్యులపై బైండోవర్ కేసులు పెట్టించారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసారు. సమావేశంలో సంఘ సభ్యులు జాన్ సైమన్, ఏశావు, నంబూరి రవీంద్ర, సకిలే శేఖర్, నేతల ఇమ్మానుయేలు, సకిలే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై మాట్లాడే అర్హత జూపూడికి లేదు

**టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్**



రాజమహేంద్రవరం సిటీ, జూలై 14: దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కు, అర్హత జూపూడి ప్రభాకర్‌కు లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన రాజమహేంద్రవరంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అంబేడ్కర్ విదేశీ విద్య పేరు మార్చినప్పుడు, 27 సంక్షేమ పథకాలు రద్దు చేసినప్పుడు, దళితులపై అన్యాయంగా దాడులు చేసినప్పుడు, అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఏనాడు జూపూడి నోరు విప్పలేదన్నారు. దళితులను అడ్డం పెట్టుకొని వైసీపీ నేతలు భూములు కాజేశారని, ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి నిధులు దారి మళ్లించి దళిత వ్యతిరేక కార్యక్రమాలు చేసిన గత ప్రభుత్వాన్ని జూపూడి వెనకేసుకురావడం సిగ్గుచేటని నవీన్‌కుమార్ అన్నారు.

## సినిమా గైడ్

| | |
|---|---|
| **కొవ్వూరు** | |
| యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1 | కల్కి |
| వై.స్క్రీన్2 | మహారాజ |
| దేవిశ్రీ(గాయత్రి) | హరోంహర |
| అనన్య | తమ్ముడు |
| **నిడదవోలు** | |
| వీ మ్యాక్స్ | కల్కి |
| రాధాకృష్ణ | కల్కి |
| శ్రీగణపతి | భారతీయుడు-2 |
| **దేవరపల్లి** | |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | కల్కి |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | కల్కి |
| **నల్లజర్ల** | |
| శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1 | భారతీయుడు-2 |
| స్క్రీన్ 2 | కల్కి |
| శ్రీనివాస | --- |